1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 03 సంచిక : 162
శుక్రవారం 19 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదు



- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు 30 వేల ఉద్యోగాలు రానున్నాయని అంచనా
- పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతికి చేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం
- ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ స్పష్టీకరణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 18)

పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 18వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 30,515 కోట్ల విలువైన 50 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 29,677 ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపన కేవలం ధనికులకే సాధ్యమనే భావనను తొలగించి, సామాన్యులు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనువైన ▶మిగతా 2లో

## భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకు కుట్ర: భాగవత్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 18)

దేశ ఎదుగుదలను అడ్డుకునేందుకు తప్పుడు కథనాలు సృష్టించి, ప్రచారం చేసే ప్రయత్నాలు భారత్‌తోపాటు విదేశాల్లోనూ జరుగుతున్నాయని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. మహారాణా ప్రతాప్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ఈరోజు భారత్ అభివృద్ధి చెందకుండా చూడాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారు. అసత్య నివేదికలను ప్రచారం చేస్తున్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు అనేక వ్యూహాలు అమలు చేస్తున్నారు. భారత్ ఎదుగుదల కేవలం ▶మిగతా 2లో

## 'అది సిగ్గుచేటు'.. ఐరోపా మిత్రదేశాలపై అమెరికా ఫైర్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 18)

ఐరోపాలోని నాటో మిత్రదేశాలపై అమెరికా రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్ విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై దాడులు చేసేందుకు ఐరోపాలోని స్థావరాలను వినియోగించుకునేందుకు అమెరికాకు అనుమతించలేదని మండిపడ్డారు. తద్వారా అనేకమంది అమెరికన్ల ప్రాణాలను ప్రమాదంలో పడేశాయని ఆరోపించారు. ఇది చాలా సిగ్గుచేటు అని విమర్శించారు. బ్రస్సెల్స్ వేదికగా నాటో సభ్యదేశాల రక్షణశాఖ మంత్రులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. ▶మిగతా 2లో

## తీర ప్రాంతాల్లో హరిత వలయాలు..



'కోస్తా గ్రీన్ బెల్ట్'పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక సమీక్ష

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 18)

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో స్పీడ్ పెంచింది. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహజ వనరులను వాడుకుంటూ అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నిరంతరం కసరత్తులు చేస్తున్నారు. ఇందులో భాగంగా... ఏపీకి ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతాన్ని అటు టూరిజం పరంగా, ఇటు పర్యావరణ పరంగా అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళుతోంది. ▶మిగతా 2లో

## అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం'





### మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

- పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే ఏపీకి అగ్రస్థానం
- కేజీబీవీ హాస్టళ్లలో విద్యార్థినులందరికీ బంక్ బెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశం
- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయానికి నిర్ణయం
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 18)

రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ ▶మిగతా 2లో

## జీ7లో సభ్యత్వం లేదు.. అయినా భారత్‌కు రెడ్ కార్పెట్ ఎందుకు?





గ్లోబల్ సౌత్ గొంతుకగా భారత్‌కు గుర్తింపు
ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటి
చైనాకు చెక్ పెట్టగలిగే వ్యూహాత్మక భాగస్వామిగా భారత్‌కు గుర్తింపు
వాతావరణ లక్ష్యాల్లో కీలక పాత్ర
స్వతంత్ర విదేశాంగ విధానంతో ప్రత్యేకత

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 18)

ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక, రాజకీయ నిర్ణయాలపై పశ్చిమ దేశాలదే పైచేయి ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. జీ7లో సభ్యదేశం కాకపోయినా.. భారత్‌కు ప్రతి ఏడాది ప్రత్యేక ఆహ్వానం అందడం వెనుక ఇదే కారణమని విశ్లేషకులు ▶మిగతా 2లో

## రైతు ఆత్మహత్యలు పట్టవు.. బీచ్‌ల్లో బార్లపైనే శ్రద్ధ: గడికోట



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 18)

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో సంక్షోభం నెలకొందని, రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందంటూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, ప్రభుత్వం మాత్రం టూరిజం పేరుతో బీచ్‌ల్లో బార్లు పెట్టడంపైనే శ్రద్ధ చూపిస్తోందంటూ మండిపడ్డారు.

అన్నపూర్ణగా పేరొందిన ఏపీలో ఇవాళ రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని శ్రీకాంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో గిట్టుబాటు ధరలు లేక అనేక మంది రైతులు తనువు చాలించాల్సి వస్తోందని.. అయినా ప్రభుత్వానికి వారి గురించి మాట్లాడే తీరిక లేదన్నారు.

గత ఏడాది రైతులు ఎరువులు, ▶మిగతా 2లో

## కేంద్ర ప్రభుత్వ పథకాల్లో చేరేందుకు ప్రత్యేక స్టాళ్లు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 18)

పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అనేక పథకాలను ప్రధాని మోదీ ప్రవేశపెట్టారని భాజపా ఏపీ అధ్యక్షులు మాధవ్ తెలిపారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పర్యటించిన ఆయన పోస్టల్‌శాఖ ద్వారా కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల నమోదు స్టాల్‌ను ప్రారంభించారు. చౌకగా, అతి తక్కువ ప్రీమియంతో జీవిత బీమా పథకాలను ప్రధాని మోదీ అమలు చేస్తున్నారని తెలిపారు. కేవలం రూ.750 చెల్లిస్తే రూ.15లక్షల ▶మిగతా 2లో

## రొయ్యల మేత కంపెనీలకూ కులం రంగా?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 18)

ఆక్వా సీడ్, ఫీడ్, ప్రాసెసింగ్ కంపెనీలన్నీ ఒకే సామాజికవర్గం చేతుల్లో ఉన్నాయంటూ వైకాపా అధినేత జగన్ చేసిన వ్యాఖ్యల్ని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. మేత తయారుచేసే కంపెనీలకు కులం రంగు పులిమి, లబ్ధి పొందాలని చూస్తారా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "మీరు, మీ తండ్రి సీఎంలుగా ఉన్నారుగా.. అప్పుడు ఈ కంపెనీలు లేవా" అని ప్రశ్నించారు. 2019-24 మధ్య రొయ్యల మేత ధరలు ఎన్నిసార్లు పెరిగాయి.. ▶మిగతా 2లో

## విశాఖపై కన్ను.. మళ్లీ బంగాళాఖాతం జలాల్లోకి పాక్ సబ్‌మెరైన్లు..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 18)

1971 ఇండియా-పాక్ వార్.. బంగ్లాదేశ్ విముక్తి కోసం జరిగిన ఈ యుద్ధంలో భారత నౌకాదళ సామర్థ్యాన్ని దాయాది కళ్లారా చూసింది. ఆ దెబ్బతో పాక్ మరోసారి బంగాళాఖాతంలోకిఅడుగుపెట్టే సాహసం చేయలేదు. అలాంటిది ఇన్నేళ్ల తర్వాత మన శత్రుదేశం కన్ను మళ్లీ ఈ జలాలపై పడింది. బంగాళాఖాతంలో జలాంతర్గాములను మోహరించే ఆలోచన చేస్తోంది. పాక్ నేవీకి చెందిన సీనియర్ అధికారి వ్యాఖ్యలతో ఈ విషయం బయటపడింది.

పాకిస్థాన్ తమ నౌకాదళంలోకి కొత్తగా హంగోర్ శ్రేణి జలాంతర్గాములను చేర్చుకునే ప్రణాళికలను



వేగవంతం చేసింది. చైనా నుంచి 8 హంగోర్ శ్రేణి సబ్‌మెరైన్ల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చు కుంది. ఇందులో ఒకటి ఇటీవల చైనా నుంచి పాక్ చేతికి వచ్చింది. దానికి ఎస్కార్ట్‌గా ఉన్న ఫ్లోటిల్లా నౌక కమాండర్ కమోడోర్ ఒమర్ ఫరూఖీ మార్గమధ్యలో శ్రీలంకలో ఆగారు. అక్కడ మాట్లాడుతూ.. "హంగోర్ శ్రేణి జలాంతర్గాములతో మా దేశ నౌకాదళ సామర్థ్యం అరేబియా సముద్రాన్ని దాటి విస్తరించనుంది. వీటితో మేం బంగాళాఖాతంలోనూ మా సైనికశక్తిని మోహరించే అవకాశం దక్కుతుంది. ఇవి గేమ్‌ఛేంజర్ సబ్‌మెరైన్లు" అని వ్యాఖ్యానించారు. దీంతో ఈ హంగోర్ జలాంతర్గాములను పాక్ బంగాళాఖాతంలో మోహరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకు కుట్ర: భాగవత్

దేశానికే కాదు, ప్రపంచానికి అవసరం. మన దేశ చరిత్ర బానిస చరిత్ర కాదు. బానిసత్వాన్ని మనపై రుద్దాలనుకున్నవారిపై చేసిన పోరాట చరిత్ర. చాలామంది ఆక్రమణదారులొచ్చారు. కొంతమంది అధికారం సంపాదించారు. కానీ భారతావని ఎన్నడూ సామాజిక, సాంస్కృతిక బానిసత్వాన్ని అంగీకరించలేదు. ఎన్నికష్టాలు వచ్చినా భారత్ ధర్మాన్ని, సంస్కృతిని వీడలేదు. మహారాణా ప్రతాప్ పోరాటం.. ధర్మం, సంస్కృతి, స్వాభిమానాన్ని కాపాడేందుకు సాగింది. ఆయన మాతృభూమి స్వేచ్ఛ కోసం యుద్ధం చేశారు. ఆయన జీవితంపై లోతైన అధ్యయనం అవసరం. వారి స్ఫూర్తితో మనం దృఢంగా ఎదగాలి. వైవిధ్యమున్నా ఏకత్వంగానూ ఉండొచ్చు. పరస్పర గౌరవం, సామరస్యం ముఖ్యం" అని భాగవత్ పేర్కొన్నారు.

## 'అది సిగ్గుచేటు'.. ఐరోపా మిత్రదేశాలపై అమెరికా ఫైర్

ఈ క్రమంలోనే ఐరోపాలోని అమెరికా దళాలపై ఆరు నెలల రివ్యూ ప్రోగ్రామ్‌ను హెగ్సెత్ ప్రకటించారు. ఐరోపా దేశాలు తమ సొంత భద్రతకు ఎంత వేగంగా చర్యలు తీసుకుంటాయనే దానిపై రివ్యూ ఫలితం ఆధారపడి ఉంటుందన్నారు. "మేం సీరియస్‌గా సమీక్ష చేస్తాం. ఐరోపా రక్షణకు అక్కడి దేశాలే ప్రాథమిక బాధ్యత వహించడానికి ముందుకు వచ్చేలా చూడటానికే ఈ ప్రోగ్రామ్‌ను రూపొందించాం" అని తెలిపారు.

### ఐఎస్ఎస్ గుప్పిట్లో మా చట్టసభ: పాక్ రక్షణ మంత్రి

హర్మూజ్‌ను తెరిపించేందుకు కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన విజ్ఞప్తిని ఐరోపా దేశాలు పట్టించుకోలేదు. దాంతో ఆగ్రహానికి గురైన ఆయన.. నాటో నుంచి వైదొలిగే యోచనలో ఉన్నామని పలుమార్లు ప్రకటించారు. నాటో కూటమికి అందిస్తోన్న సాయాన్ని కత్తిరించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు చేస్తోంది. ఐరోపాలో నాటో కార్యకలాపాల కోసం అందుబాటులో ఉంచిన విమానాలు, యుద్ధనౌకలను తగ్గించాలని యోచిస్తున్నట్లు సమాచారం.

## తీర ప్రాంతాల్లో హరిత వలయాలు..

ఏపీ కోస్తా తీరాన్ని శరవేగంగా అభివృద్ధి చేయడమే కాకుండా, పర్యావరణ రక్షణ కోసం 'కోస్తా గ్రీన్ బెల్ట్'ను విస్తరించేందుకు డిప్యూటీ పవన్ కల్యాణ్ నడుం బిగించారు. ఇందులో భాగంగా ఈరోజు సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.తీర ప్రాంతాల్లో భారీగా మొక్కలు నాటి, హరిత వలయాలను (గ్రీన్ జోన్స్) ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు కోతను అడ్డుకోవచ్చని, తుపానుల తీవ్రతను తగ్గించవచ్చని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దీనికోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ గ్రీన్ బెల్ట్ ప్రాజెక్ట్‌లో కేవలం ప్రభుత్వానిదే కాకుండా స్థానిక ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లో సామాజిక అడవుల పెంపకానికి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించాలని, తద్వారా పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని అధికారులకు స్పష్టం చేశారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాల్లో చేరేందుకు ప్రత్యేక స్టాళ్లు

ప్రమాద బీమా సదుపాయం ఉందన్నారు. పోస్టల్ ద్వారా అత్యధిక వడ్డీ ఇచ్చే పలు పథకాలను మోదీ ప్రవేశ పెట్టి సమర్థంగా అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో చేరేందుకు అన్ని నగరాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వికసిత భారత్ లక్ష్య సాధన కోసం అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## రొయ్యల మేత కంపెనీలకూ కులం రంగా?

కూటమి ప్రభుత్వ హయాం రెండేళ్లలో ఎన్నిసార్లు పెరిగాయో చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. "ప్రస్తుతం సోయా మీల్, ఫిష్ మీల్, ఫిష్ ఆయిల్.. అన్నింటి ధరలూ పెరిగాయి. అయినా.. మేత ధరలు పెంచడానికి అనుమతించలేదు. రైతుల్ని, కంపెనీల్ని సమావేశపరిచాం" అని వివరించారు.

### 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదు

వాతావరణం సృష్టించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ ఫలాలు పేద, మధ్య తరగతికి ఉద్యోగాల రూపంలోనే కాకుండా, వారు కూడా కంపెనీలు స్థాపించేలా ప్రోత్సహించాలి. స్టార్టప్‌లకు పెద్దపీట వేయాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ (ఆర్టీఐహెచ్) సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు ఆకర్షించాలి" అని దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టులకు అనుమతులు పొందాక వెంటనే పనులు ప్రారంభించని సంస్థల విషయంలో కఠినంగా

## మొదటి పేజీ తరువాయి

వ్యవహరించాలని, 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదని హెచ్చరించారు.

### ఇథనాల్, సెమీ కండక్టర్లకు పెద్దపీట

ఇథనాల్ ఆధారిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఇంధన దిగుమతుల భారం తగ్గుతుందని సీఎం అన్నారు. 40 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌కు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు.

అదేవిధంగా, సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లీథియం అయాన్, ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీల ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతుల కోసం ప్రత్యేకంగా మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైతులకు తక్కువ ధరకే పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

### పర్యాటకం, మౌలిక వసతులపై దృష్టి

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని, హార్సిలీ హిల్స్‌లో మంచి రిసార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పురాతన స్వర్ణగిరిగా పేరున్న జొన్నగిరి గోల్డ్ మైన్ ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు.

పారిశ్రామిక ప్రాంతాల వద్ద కార్మికులకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను ఆటోమేషన్ చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాలని, బెంగళూరు-పుట్టపర్తిని ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్‌గా మార్చాలని ఆదేశించారు.

### ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేశ్

ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక సూచనలు చేశారు. భూ కేటాయింపులు పొందిన కంపెనీలు ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాతే ప్రోత్సాహకాలు, రాయితీలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమైతేనే జీఎస్టీ రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసంగా ఉంటుంది" అని అభిప్రాయపడ్డారు.స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం'

స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఈ ఘనత సాధించిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, అభ్యసన సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పనపై పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

### మౌలిక వసతులు, విద్యార్థి కిట్లపై ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్రవ్యాప్తంగా కడప మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీని మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలోని 430 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న 1,06,360 మంది విద్యార్థినులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 53,180 బంక్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదుపాయాన్ని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు కూడా విస్తరించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.

### అనాథ పిల్లలకు 'తల్లికి వందనం' భరోసా

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు సైతం ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని అనాథ పిల్లలకు కూడా వర్తింపజేయాలని, ఇందుకోసం వారి గార్డియన్ల వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరూ లేని పక్షంలో, ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, వారి ద్వారా పిల్లలకు చేరేలా చూడాలన్నారు. అంతేకాకుండా, అనాథ పిల్లల పేరుపై బ్యాంకు ఖాతాలు తెరిచి, పథకం నిధులను నేరుగా జమ చేయాలని సూచించారు. వారి చదువు పూర్తయ్యాక ఆ మొత్తాన్ని వారు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ఇది వారి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా ఇస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

### అభ్యసన సామర్థ్యాల పెంపు, తెలుగు భాషకు ప్రాధాన్యం

పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువమంది విద్యార్థులు గణితం, సైన్స్, తెలుగు సబ్జెక్టుల్లో విఫలమవుతున్నారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన లోకేశ్, ఎట్టి పరిస్థితుల్లోనూ మాతృభాష తెలుగును విస్మరించవద్దని, ఈ విషయంలో ఉపాధ్యాయులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఆయా సబ్జెక్టుల్లో బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారుచేసి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు తరగతులు నిర్వహించాలన్నారు.ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి సీతారామరాజు, పోలవరం వంటి ప్రాంతాల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయుల లభ్యతను సమీక్షించి కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల హాజరు శాతం 95కి తగ్గకుండా, మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడకుండా చూడాలన్నారు.

### ఆధునీకీకరణ, పారదర్శకత దిశగా అడుగులు

తెలుగు అకాడమీ ముద్రించే పాఠ్యపుస్తకాలను ప్రజలకు సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌ల ద్వారా విక్రయించాలని మంత్రి ఆదేశించారు. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల అనుమతుల్లో అనవసర నిబంధనలను తొలగించాలని, అదే సమయంలో వారు నిర్ణయించిన ఫీజుల వివరాలను స్కూళ్ల బయట బోర్డులపై ప్రదర్శించడంతో పాటు పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని స్పష్టం చేశారు.

హైస్కూలు విద్యార్థులకు త్వరగా క్రోమ్ బుక్స్‌తో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌లు అందించాలని కూడా మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జీ7లో సభ్యత్వం లేదు.. అయినా భారత్‌కు రెడ్ కార్పెట్ ఎందుకు?

చెబుతున్నారు. ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం పెరగడంతో జీ7 దేశాలు కూడా మనదేశ అభిప్రాయాన్ని విస్మరించలేని పరిస్థితి ఏర్పడింది.అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ కలిసి జీ7 కూటమిగా ఉన్నాయి. ఈ దేశాలే ప్రపంచంలోని సంపన్న ఆర్థిక వ్యవస్థలుగా గుర్తింపు పొందాయి. అయితే వాతావరణ మార్పులు, ఆర్థిక సంక్షోభాలు, భద్రతా సవాళ్లు, సరఫరా వ్యవస్థల వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకునే సమయంలో భారత్‌ను కూడా చర్చల్లో భాగస్వామి చేస్తున్నాయి.

### గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుక

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు అంతర్జాతీయ వేదికలపై తగిన స్థాయిలో ప్రతిబింబించడం లేదనే భావన చాలాకాలంగా ఉంది. ఈ దేశాల తరఫున బలంగా మాట్లాడుతున్న దేశంగా భారత్ ఎదిగింది. అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వారధిగా వ్యవహరిస్తోంది. అందుకే ప్రపంచ స్థాయి విధానాలు విజయవంతం కావాలంటే భారత్ వంటి దేశాల సహకారం అవసరమని జీ7 దేశాలు భావిస్తున్నాయి.

### భారీ మార్కెట్‌గా భారత్

140 కోట్లకు పైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగం, సాంకేతిక రంగాల్లో వేగంగా ఎదుగుతోంది. సరఫరా వ్యవస్థలను విస్తరించాలనుకుంటున్న పలు దేశాలకు భారత్ కీలక భాగస్వామిగా మారింది. ప్రపంచ ఆర్థిక స్థిరత్వంలోనూ భారత్ పాత్ర రోజురోజుకూ పెరుగుతోంది. అందుకే జీ7 దేశాలు భారత్‌తో ఆర్థిక సహకారానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

### చైనా ప్రభావానికి చెక్

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావం పెరుగుతుండటం పలు దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్‌ను వ్యూహాత్మక భాగస్వామిగా పరిగణిస్తున్నారు. భౌగోళిక స్థానం, సైనిక సామర్థ్యం, ఆర్థిక బలం కారణంగా ఆసియాలో 'పవర్ బ్యాలెన్స్'ను కాపాడగల దేశంగా భారత్‌ను చూస్తున్నారు.

### వాతావరణ లక్ష్యాల్లో కీలక పాత్ర

ప్రపంచ వాతావరణ లక్ష్యాలు సాధించాలంటే 140 కోట్ల జనాభా ఉన్న భారత భాగస్వామ్యం తప్పనిసరి. పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ భారీ పెట్టుబడులు పెడుతోంది. అంతర్జాతీయ సౌర కూటమి వంటి కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తోంది. అందుకే వాతావరణ మార్పులపై జరిగే ప్రతి కీలక చర్చలో భారత్‌కు ప్రత్యేక స్థానం లభిస్తోంది.

### స్వతంత్ర విదేశాంగ విధానం

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వంటి అంశాల్లో భారత్ తన స్వతంత్ర వైఖరిని కొనసాగిస్తోంది. ఏ ఒక్క కూటమికీ పూర్తిగా అనుకూలంగా కాకుండా, చర్చలు, దౌత్య పరిష్కారాలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ విధానం వల్లే వివిధ దేశాలతో సమాన సంబంధాలు కొనసాగించగలుగుతోంది.

### నామమాత్రం కాదు

జీ7 సమావేశాల్లో భారత్ పాల్గొనడం ఇప్పుడు కేవలం ఆహ్వానిత దేశం హోదాకు మాత్రమే పరిమితం కావడం లేదు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆహార భద్రత, సాంకేతికత, అభివృద్ధి వంటి అంశాలపై తన ఆలోచనలు, పరిష్కారాలను ప్రపంచానికి సూచిస్తోంది.

## రైతు ఆత్మహత్యలు పట్టవు.. బీచ్‌ల్లో బార్లపైనే శ్రద్ధ: గడికోట

విత్తనాలు దొరక్క అల్లాడిపోయారని... అయినప్పటికీ, ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఎరువుల సరఫరాపై ఎలాంటి ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోలేదని ఆరోపించారు. రాయలసీమను 'హార్టికల్చర్ హబ్' చేస్తామని నమ్మించిన చంద్రబాబు... ఇప్పుడు తోతాపురి మామిడి రైతులను కూడా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కార్పొరేట్ రంగానికి రెడ్ కార్పెట్ పరుస్తూ... 65 శాతం ఉన్న వ్యవసాయ రంగాన్ని నట్టేట ముంచుతున్నారని విమర్శించారు.వైఎస్సార్ హయాంలో తెచ్చిన ప్రాజెక్టుల వల్లే రాయలసీమ రైతులు నిలబడ్డారని, ఆ తర్వాత జగన్ ప్రభుత్వం రూ.1,700 కోట్లు ఖర్చు చేసి రైతులకు నాణ్యమైన 9 గంటల ఉచిత విద్యుత్ అందించిందని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం మంచి పనులు చేయడం పక్కనబెట్టి, నిత్యం జగన్ మీద విషం చిమ్మడం, డైవర్షన్ పాలిటిక్స్ చేయడమే పనిగా పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విజయవాడ రౌడీ షీటర్ సాయికృష్ణ మిస్సింగ్ వ్యవహారంపై ఆయన మాట్లాడుతూ... పోలీసులు సాయికృష్ణని లాకప్‌లో చంపేసి, కనీసం ఆ తల్లికి డెడ్ బాడీ కూడా ఇవ్వకుండా దాచేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలను ప్రశ్నిస్తే ప్రభుత్వం కులాల ప్రస్తావన తెస్తోందని, నిలదీసిన వారి సోషల్ మీడియా అకౌంట్లను బ్లాక్ చేస్తూ అణచివేతకు పాల్పడుతోందని మండిపడ్డారు.

## ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలలో శ్రీ ప్రతిభ రాష్ట్ర స్థాయిలో టాప్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18)

గురువారం విడుదలైన మే 2026 ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలలో శ్రీ ప్రతిభ కళాశాల విద్యార్థులు మరొకసారి రాష్ట్ర స్థాయిలో టాప్ మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ యంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను 991 మార్కులతో ఇద్దరు, 990 మార్కులతో ఐదుగురు, 989 మార్కులతో ఏడుగురు, 988 మార్కులతో ఆరుగురు, 987 మార్కులతో ఎనిమిది,986 మార్కులతో ఆరుగురు, 985 మార్కులతో ఆరుగురు, 980 మార్కులకు పైగా 70 మంది విద్యార్థులు సాధించినారు.అదే విధంగా బై.పి.సి విభాగములో 1000 మార్కులకు 989 మార్కులతో ఇద్దరు, 987 మార్కులతో ఒక్కరు సాధించారు.సీనియర్ ఇంటర్ విభాగంలో అత్యధికంగా 95% ఉత్తీర్ణత శాతంతో జిల్లాలో పైచేయి సాధించినారు.జూనియర్ ఇంటర్ యం.పి.సి విభాగంలో 470 మార్కులకు



467 మార్కులతో ముగ్గురు, 466 మార్కులతోనలుగురు, 465 మార్కులతో పదకొండు, 464 మార్కులతో పదిహేను, 450 మార్కులకు పైగా 170 మంది విద్యార్థులుసాధించినారు. బై.పి.సి విభాగములో 455 మార్కులకు 451 మార్కులతో ఒక్కరు, 449 మార్కులతో ఒక్కరు సాధించారు.అదే విధంగా సిఇసి విభాగములో 500 మార్కులకు 493 మార్కులతో ఒక్కరు సాధించారు.శ్రీ ప్రతిభ విద్యాసంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ నల్లూరి సీతా రామాంజనేయులు ,సి.ఇ.ఒ శ్రీ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ ఈ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకుమరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలియజేసినారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవం

### నేడు మాచర్లలో జరిగే భారీ బహిరంగ సభకు తరలిరండి

### యాగంటి మల్లికార్జునరావు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 18)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు మాచర్ల పట్టణం శ్రీనివాస మహల్ సెంటర్ వద్ద మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మాచర్ల పట్టణంలోని పలు వార్డులలో విస్తృతంగా పర్యటించిన యాగంటి మల్లికార్జున రావు , ప్రజలను, కార్యకర్తలను, అభిమానులను కలిసి రేపటి సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆత్మీయంగా ఆహ్వానించారు. 2019-2024 మధ్య వైసీపీ చేసిన అరాచకం, విధ్వంసం నుండి రాష్ట్రాన్ని కాపాడి, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చి నేటికి రెండేళ్లు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, సంక్షేమం - అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ 'మంచి ప్రభుత్వం' అని ప్రజల చేత అనిపించుకున్నాం అని వెల్లడించారు.









ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

19.06.26 శుక్రవారం




# సంక్షేమ, అభివృద్ధి, ఆధ్యాత్మికతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది

## జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 18)

సంక్షేమ, అభివృద్ధి, ఆధ్యాత్మికతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన ప్రారంభమై రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా గురువారం ఒంగోలు ఎస్జివిఎస్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సంబరాలను జిల్లా ఇంఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా మంత్రులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు, సంతనూతలపాడు, కనిగిరి, కందుకూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్‌రావు, బి ఎన్ విజయకుమార్, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా ఎస్పి వి హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఎపి పర్యటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్, ఎపి మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ విజయ కుమార్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ ముప్పవరపు సుచిత్ర, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటరావు, కల్చర్ కమీషన్ చైర్‌పర్సన్ తేజస్విని, దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. విజయోత్సవ వేడుకల సందర్భంగా జలధార – జలహారతి, జల సురక్షా మాసం, రెండేళ్ల అభివృద్ధిల పై రూపొందించిన ఏవి లను మంత్రులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రెండేళ్ళ ఎన్డీఏ కూటమి పాలనలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలుగా ముందుకు సాగుతున్నదన్నారు. రెండేళ్ళ రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ప్రకాశం జిల్లా స్వర్ణాంధ్ర వైపు పయనించిదన్నారు. జిల్లా చరిత్రలో తొలిసారిగా 10 వేల కోట్ల పై చిలుకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని, అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం, స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం, దేపం–2 పథకం, పశు సంపద కిసాన్ క్రెడిట్ కార్డులు, చీ= భరోసా పింఛను పథకం, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి, మత్చకార భరోసా, ఉచిత విద్యుత్ రాజ,నా కుటుంబాలకు, ఎన్టీఆర్ వైద్య సేవ తదితర సంక్షేమ కార్యక్రమాల కోసం



జిల్లాలో ఇప్పటికే 7163.86 కోట్ల రూపాయలను సుపరిపాలన ద్వారా సూపర్ సిక్స్ పథకాలతో అందించడం జరిగిందన్నారు. అలాగే ప్రకాశం జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల అమలులో భాగంగా పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పరిశ్రమల శాఖ, దేవాదాయ శాఖ అధ్వర్యంలో ఇప్పటికే 3068.07 కోట్ల నిధులను మౌలిక వసతుల కల్పనకు మంజూరు చేయడం జరిగిందని ఇంచార్జి మంత్రి వివరించారు. ఒక్క ప్రకాశం జిల్లాలోనే చీణూ కూటమి పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్ ల సారధ్యంలో రూ.10231.93 కోట్లను రెండేళ్ళ నమ్మకంగా ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. ప్రజల ఆశీస్సుల కోసం నేటి కార్యక్రమం చేపట్టినట్లు ఇంచార్జి మంత్రి తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి, ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని, నేడు ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ రావాలన్న సంకల్పంతో రాష్ట్రంలో ఆధ్యాత్మికత పెరగాలన్నారు లక్ష్యంతో హిందూ ధర్మంతో పాటు అన్నీ మతాల ప్రాధాన్యత పెరగాలన్న ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ప్రకాశం జిల్లాలో ఇప్పటికే దూపదీప నైవేద్యం పేరుతో 214 ఆలయాలకు 2 కోట్ల 57 లక్షల రూపాయలు ప్రతి నెలా ఒకటవ తేదీనే రూ.10 వేల వంతున ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే కామన్ గుడ్ ఫండ్ కింద 50 పనులకు రూ.59 కోట్ల 45 లక్షల రూపాయలు మంజూరు చేసి ఆలయాలను పునర్నిర్మాణ పనులు చేపట్టినట్లు ఇంచార్జి మంత్రి తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ కింద మూడు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో 5 వేల ఆలయాల నిర్మాణాలు జరగాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డా డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రూ.10 లక్షల కోట్ల అప్పు ఉండగా, సమర్ధవంతమైన నాయకత్వంలో ఓవైపు ఆ అప్పులు తీర్చుకుంటూ మరో వైపు ప్రజలకు సంక్షేమం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధికంగా పించన్ అందచేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు. దీపం పథకం 2.0 కింద 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం ఇవ్వడం జరుగుచున్నదన్నారు. అన్నా క్యాంటిన్లను తిరిగి ప్రారంభించడమే కాకుండా, దర్శి, కొండపి వంటి ప్రాంతాలలో కూడా అన్నా క్యాంటిన్ లను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టులు, 6 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా రాష్ట్రానికి 20 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకు వచ్చి, 21 లక్షల మంది ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఎంత మంది చదువుకున్న పిల్లలు ఉంటే అంతమందికి వర్తించేలా తల్లికి వందనం, ఆటో డ్రైవర్ల సేవలో, మత్స్యకార సేవలో వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. వెలుగొండ ప్రాజెక్టు ఈ సంవత్సరంలో పూర్తీ చేసి నలమల సాగర్ లోని నీరు తీసుకురావడం జరుగుతుందని మంత్రి స్పష్టం చేసారు. పాలేరు, కొరిశపాడు ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించి వాటిని పూర్తీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. (తరువాయి 4లో...)




# సర్ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 18)

ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత హెచ్చరించారు. మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డులో గురువారం సర్ కార్యక్రమం పై బూత్ లెవెల్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల కనుసన్నల్లో పనిచేసిన వారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రలోభ పెట్టే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అర్హులైన వారి ఓట్లను తీసివేయకుండా జాగ్రత్త పడాలన్నారు. మీకు ఇచ్చిన ఫారాలను వేరే వారికి అప్పగించడం ఒంటి కార్యక్రమాలు చేయకూడదన్నారు. సోమవారం నాటికి అప్లికేషన్ ఫారాలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందజేయాలన్నారు. (తరువాయి 4లో...)

# పొగాకు రకం ఏదైనా కేజీ రూ.200 తగ్గకూడదు

నో బిడ్ లో బిడ్ ఉండకూడదు

మార్కెట్‌కు వచ్చిన పంట తిరిగి వెళ్లకూడదు

బోర్డు పరిధిలో కాకుండా...

అనధికార కొనుగోళ్లపై కఠిన చర్యలు

పొగాకు రైతులను ఆదుకునేలా కేంద్రంతో మాట్లాడతాం

ట్రేడర్లు, పొగాకు రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 18)

పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మార్కెట్‌లో పొగాకు రకం ఏదైనా కిలో రూ.200 కంటే తగ్గడానికి వీల్లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో పొగాకు రైతులు, ట్రేడర్లతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించి పొగాకు ధరలపై సమీక్షించారు. ఇటు రైతులు, అటు ట్రేడర్ల సమస్యలను తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు రైతులను ఆదుకునేందుకు ట్రేడర్లు, కొనుగోళ్ల కంపెనీలు నూటికి నూరు శాతం మానవీయ కోణంలో రైతులకు సహకరించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పొగాకు వేలం కేంద్రాల్లో నో బిడ్, లో బిడ్ అనే మాటలకు తావుండకూడదన్నారు. రైతులు మార్కెట్టుకు తెచ్చిన పొగాకు బేళ్లను వెనక్కి పంపే పరిస్థితులు అస్సలు ఉండకూడదని చెప్పారు. మార్కెట్లోకి వచ్చిన పొగాకును కంపెనీలు కొనుగోలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. దీనికి అనుగుణంగా అన్ని పొగాకు వేలం ప్లాట్‌ఫారమ్‌లను (తరువాయి 4లో...)






# ఎర్రగొండపాలెం సీటు తాటిపర్తికే ఇవ్వాలి

## మాజీ ఎమ్మెల్యే కే పీ కొండారెడ్డి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 18)

మార్కాపురం జిల్లా రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. యర్రగొండపాలెం నియోజకవర్గ టికెట్ విషయంలో సీనియర్ రాజకీయ కురవృద్ధుడు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆశావాహులు ఎంతమంది ఉన్నా, ప్రజల్లో బలమైన ఆదరణ కలిగిన తాటిపర్తి మాత్రమే గెలుపు గుర్రమన్నారు. ఎర్రగొండపాలెం సీటు తాటిపర్తికే దక్కాలి అని ఆయన స్పష్టం చేశారు.

# జిల్లాలో నీట్ పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రకాశం జిల్లాలో 1,821 విద్యార్థుల కోసం 6 పరీక్షా కేంద్రాలు సిద్ధం

వివిధ శాఖల సమన్వయంతో జిల్లాలో నీట్ పరీక్ష సజావుగా జరిగేందుకు చర్యలు

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 18)

జిల్లాలో ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ స్థాయి నీట్ పరీక్షను సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. నీట్ పరీక్ష సక్రమ నిర్వహణ పై గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలసి రెవెన్యూ, బ్యాంకు, పోలీస్, పోస్టల్, విద్యా, వైద్య, అగ్నిమాపక, ప్రజా రవాణా, విద్యుత్ తదితర శాఖల అధికారులతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21న జరగనున్న జాతీయ స్థాయి నీట్ యుజి పరీక్షకు జిల్లాలో మొత్తం 6 పరీక్షా కేంద్రాల్లో 1,821 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష ఉంటుందని, పీడబ్ల్యూ విద్యార్థులకు 6.20 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుందన్నారు. పరీక్ష జరిగే ప్రతి కేంద్రంలో తగిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ హాజరు వంటి చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. (తరువాయి 4లో...)

# సంక్షేమ, అభివృద్ధి, ఆధ్యాత్మికతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది















అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తూ ముందుకు పోతున్నట్లు మంత్రి తెలిపారు. పోలవరం, వెలుగొండ, అమరావతి నిర్మాణం మళ్లీ వెనక్కి పోకుండా ఉండాలంటే కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని, అలాగే కూటమి ప్రభుత్వం ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రెండేళ్ళ పాలనలో చేపట్టిన మంచి కార్యక్రమాలను ప్రజల్లో తీసుకువెళ్ళాలన్న ఉద్దేశ్యంతో ప్రతి జిల్లా కేంద్రంలో, నియోజక వర్గ కేంద్రంలో ఈ కార్యక్రమాలను నిర్వహించుకోవడం జరుగుచున్నదన్నారు. రైతు నుంచి యువత వరకు, మహిళల నుంచి వృద్ధుల వరకు, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన ఆరు హామీలు నేడు కోట్లాది మంది జీవితాల్లో మార్పుకు నాంది పలుకుతున్నాయన్నారు. ఎన్టీఆర్ భరోసా, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం 2.0, యువతకు ఉపాధి అవకాశాలు వంటి కార్యక్రమాలు లక్షలాది కుటుంబాలకు భరోసా, ఆత్మవిశ్వాసం, మరియు ఆర్థిక బలాన్ని అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, సంక్షేమం మరియు అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తూ, నవ్యాంధ్ర నిర్మాణంలో వేగంగా అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టును పూర్తీ చేయకుండానే జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు. నేడు 500 కోట్ల రూపాయలతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్స్ పనులు చేపట్ట చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అలాగే ప్రజల కోరిక మేరకు అశాస్త్రీయంగా గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా బాపట్ల జిల్లాలోకి వెళ్లిన అద్దంకిని, నెల్లూరు జిల్లాలోకి వెళ్లిన కందుకూరు నియోజకవర్గాలను తిరిగి ప్రకాశం జిల్లాలోకి కలిపినట్లు గుర్తు చేశారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వనన్ని సంక్షేమ పింఛన్లను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందిస్తుందని మంత్రి గొట్టిపాటి వివరించారు. ఈ పింఛన్ల కోసం ప్రతీ ఏటా రూ.33 వేల కోట్లను ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా నల్ల బర్లీ పొగాకు ను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసిందని మంత్రి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం కోసం రూ.10,000 కోట్లకు పైగా తల్లికి వందనం ద్వారా అందించినట్లు వివరించారు. పాఠశాల విద్య బలోపేతానికి 16,000 పైగా టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేశామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. గుండ్లకమ్మ అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా, అబద్ధపు ప్రచారాలతో ప్రాజెక్టు పూర్తయ్యిందని జాతికి అంకితం చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుండ్లకమ్మ ముంపు గ్రామాలకు రూ.900 కోట్లకు పైగా నిధులను మంజూరు చేశామన్నారు. ప్రతినెలా గుండ్లకమ్మ ప్రాజెక్టును ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారని తెలిపారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రెండేళ్లలో ప్రజలకు కల్పించిన నమ్మకం, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించేలా ఈ విజయోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి అభివృద్ధి, సంక్షెం రెండు కళ్ళు లాంటివన్నారు. గడిచిన 23 నెలల కాలంలో రాష్ట్రానికి 23 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకురావడం జరిగిందని, దేశ మొత్తంలో 25 శాతం పెట్టుబడులు అని అన్నారు. రామయపట్నం పోర్టు రాకతో ప్రకాశం జిల్లా కు సుమారు 4 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు రాబోతున్నాయని, అందుకనుగుణంగా మరిన్ని మౌలిక వసతులతో ఒంగోలు నగరాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ రెండేళ్ళ పాలనలో సాధించిన ప్రగతిని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు వివరిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అన్నీ శాఖల సమన్వయంతో పూర్తి చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నదన్నారు. ఎంతో విజన్‌తో కూడుకున్న జలధార-జల హారతి కార్యక్రమాన్ని 100 రోజుల యాక్షన్ ప్లాన్ తో జిల్లాలో పటిష్టంగా చేపట్టడం జరుగుచున్నదన్నారు. 2024 సంవత్సరం ముందు జిల్లలో వాటర్ టేబుల్ 9 మీటర్ల లోతులో ఉంటే, ఈ రెండేళ్ళ పాలన లో తీసుకున్న జల సంరక్షణ కార్యక్రమాల వలన నేడు జిల్లాలో 3 మీటర్లు వాటర్ పెరిగి నేడు 9 మీటర్ల లోతులో ఉందన్నారు. ఒక మీటర్ వాటర్ లెవల్ 4 టిఎంసిల నీటితో సమానమని కలెక్టర్ వివరించారు. జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ రెండేళ్ళ పాలనలో పోలీసుశాఖ ఎంతో పురోగతి సాధించడంతో పాటు క్రైమ్ శాతం తగ్గిందన్నారు. శాంతిభద్రతల పరిస్థితి మెరుగుపరచాలి, అంకిత భావంతో పనిచేయాలి, ప్రజలకు మరింతగా సేవ చేయాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు పోలీసుశాఖ మొత్తం కష్టపడి పనిచేస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలన్న లక్ష్యంతో పోలీసు శాఖ ముందుకు పోతుందన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో పోలీసుశాఖ తీసుకున్న చర్యల వలన 25 శాతం మేర క్రైమ్ రేట్ తగ్గించడం జరిగిందన్నారు. అలాగే మహిళల పై కూడా 22 శాతం మేర క్రైమ్ రేట్ తగ్గించడం జరిగిందని ఎస్పి వివరించారు. సిసి టివి, డ్రోన్స్ వినియోగం వంటి సాంకేతికతను వినియోగిస్తూ, శాంతి భద్రతల పట్ల ప్రజల్లో నమ్మకం పెంచేలా పోలీసుశాఖ నిరంతరం పనిచేస్తున్నదన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ గడిచిన రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఒకవైపు సంపద పెంచుతూనే, మరోవైపు సంక్షేమ కార్యక్రమాలను,అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకువెళు న్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్ళలో సాగుతున్నాయి. గడిచిన రెండు సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామజిక పెన్షన్ల పెంపుదల, అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు సంవత్సరానికి 20 వేలు, తల్లికి వందనం పథకం కింద చదువుకొనే ప్రతి పిల్లవానికి సంవత్సరానికి 15 వేలు, ఫీజు రీయింబర్స్మెంట్, స్త్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం,దివ్యాంగులందరికీ ఉచిత బస్ సౌకర్యం, ఆటో డ్రైవర్ సేవలో పథకం కింద ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 15 వేలు, దీపం 2.0 పథకం కింద అర్హులైన కుటుంబాలకు సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఎపి పర్యటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని నిరూపిస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ గడిచిన రెండేళ్ళ కాలంలో పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు పోతున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండే ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని స్పష్టం చేసారు. ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్‌కె రియాజ్ మాట్లాడుతూ ఎన్నికల సమాయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్దే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. తొలుత ఎన్జీవిఎస్ కన్వెన్షన్ ప్రాంగణంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రులు, శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు తిలకించారు. ఈ సందర్భంగా డిఆర్డిఎ ద్వార్ బ్యాంకు లింకేజి కింద 13,969 స్వయం సహాయక సంఘాలకు 210.30 కోట్ల రూపాయలు, స్త్రీ నిధి పథకం కింద 2,514 మందికి 22.58 కోట్ల రూపాయలు, మెప్మా ద్వారా 918 స్వయం సహాయక సంఘాలకు 10.24 కోట్ల రూపాయల మెగా చెక్కులను లబ్దిదారులకు, మంత్రులు అందచేసారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లాలో నీట్ పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



పరీక్ష నిర్వహణ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలను చోటు చేసుకోకుండా పరీక్షా కేంద్రాలు, వాటి చుట్టుపక్కల అవసరమైన బందోబస్తు చర్యలు పటిష్టంగా అమలు చేయలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు పోలీస్ శాఖ ద్వారా చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన పూర్తి సిబ్బందిని ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. విద్యార్థులకు సకాలంలో రవాణా సౌకర్యం కల్పించేలా ప్రజా రవాణా శాఖ ద్వారా పరీక్ష కేంద్రాల రూటులలో ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. పరీక్షకు హాజరగు విద్యార్థులకు ఆర్టిసి బస్సులలో ఉచితంగా ప్రయాణించేలా సదుపాయం కల్పించినందున, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, ఆర్టిసి అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా ఉండేలా విద్యుత్ శాఖకు, వైద్య శిబిరంతో పాటు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని వైద్య శాఖకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పోస్టల్ శాఖ పరీక్షా పత్రాల రవాణా, భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. బ్యాంకుల్లో పరీక్షా పత్రాల భద్రం, ప్రశ్నాపత్రాల స్వీకరణ, స్టోరేజ్, ఉపసంహరణ, పరీక్షా కేంద్రాలకు తరలింపు, పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ప్రాథమిక సౌకర్యాల కల్పన, పరీక్షా నిర్వహణ వంటి అంశాలు ప్రతి దశలోను ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో విజయవంతంగా నీటి పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో మాధురి, ఒంగోలు ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, డీఈవో రేణుక , డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్‌టిసి ఆర్ఎం సత్యనారాయణ, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ ఎం మనీష్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



వచ్చేనెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఆర్డిఓ వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, తహసీల్దార్ చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పొగాకు రకం ఏదైనా కేజీ రూ.200 తగ్గకూడదు నో బిడ్ లో బిడ్ ఉండకూడదు



పూర్తి స్థాయిలో ప్రారంభించాలని చేయాలని ఆదేశించారు. అలాగే పొగాకు కంపెనీలన్నీ తప్పనిసరిగా కొనుగోళ్లు చేపట్టాలని, ఏ ఒక్క కంపెనీ కూడా వెనక్కు వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. టొబాకో బోర్డ్ పరిధిలో కాకుండా అనధికారికంగా కొనుగోళ్లు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే అరెస్టులు చేస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. తనకు రైతుల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి ఈ ఏడాది పొగాకు ట్రేడర్లు, కంపెనీలు ప్రభుత్వానికి, రైతులకు సహకరించాలని కోరారు. రాబోయే ఏడాది నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే పొగాకు మార్కెట్ స్థిరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తుందన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. రైతులు, టొబాకో బోర్డు ప్రతినిధులను వెంట పెట్టుకుని ఢిల్లీ వెళ్లి సంబంధిత మంత్రులు, అధికారులను కలవాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, టొబాకో బోర్డ్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రెండేళ్ల కూటమి పాలనలో వినుకొండ నియోజకవర్గం

## రికార్డు స్థాయి అభివృద్ధి
## రూ.వందల కోట్లతో మారిన రూపురేఖలు
## ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 18)**

వినుకొండ నియోజకవర్గంలో గత రెండేళ్ల (2024-2026) ఎన్డిఏ కూటమి ప్రభుత్వ హయాంలో అపూర్వమైన అభివృద్ధి, సంక్షేమ విప్లవం జరిగిందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు, కూటమి ప్రతినిధులు వెల్లడించారు. 'వినుకొండ నియోజకవర్గం 2 ఇయర్స్ ప్రోగ్రామ్ ప్రెజెంటేషన్' పేరిట విడుదల చేసిన అధికారిక నివేదికలో 2019-21, 2024-26 మధ్య జరిగిన ప్రగతిని గణాంకాలతో సహా బహిరంగపరిచారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రస్తుత ప్రభుత్వం సాధించిన రికార్డు స్థాయి విజయాలను ఈ సందర్భంగా ప్రజల ముందుంచారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రూ. 239 కోట్లతో వినుకొండ పట్టణ శాశ్వత త్రాగు నీటి సరఫరా పథకం పనులు ప్రారంభించినట్లు నివేదిక పేర్కొంది. అలాగే జలజీవన్ మిషన్ కింద రూ. 34 కోట్లతో 58 గ్రామాలలో ఇంటింటికి నిబళాయి కనెక్షన్లు మంజూరు చేశారు. గతంలో 2019-21 మధ్య కేవలం 24 జలజీవన్ పనులు జరిగితే, ఈ రెండేళ్లలో ఆ సంఖ్య 58కి చేరి రూ. 34.5 కోట్ల వ్యయం చేశారు. మౌలిక సదుపాయాల రంగంలో రహదారుల పునర్నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించారు. అందులో భాగంగా రూ. 29.23 కోట్లతో గుంతలమయమైన 56 ఆర్ అండ్ బి తారు రోడ్ల నిర్మాణం పూర్తయింది. గతంలో ఈ పనులు కేవలం 31 మాత్రమే జరిగాయి. మున్సిపల్ అభివృద్ధి కింద గత ప్రభుత్వంలో రూ. 6.76 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం రూ. 265.58 కోట్లతో 155 అభివృద్ధి పనులను చేపట్టింది. పంచాయతీ రాజ్ రోడ్ల కింద రూ. 29.26 కోట్లతో 11 పనులు పూర్తి చేశారు. సిసి రోడ్లు మరియు డ్రెయిన్ల వర్కుల సంఖ్యను 22 నుండి 198 కి పెంచి, రూ. 18.50 కోట్లు వెచ్చించారు. వీటితో పాటు ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న కొండ్రముట్ల-కనమర్లపూడి, దొండపాడు, జాలలపాలెం,



బొగ్గరం-చిట్టాపురం, పలుకూరు-కనుమలచేరువు రోడ్లు పూర్తి చేయడంతో పాటు, శానంపూడి, వైకల్లు వద్ద రూ. 35.92 కోట్లతో హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణం వేగంగా సాగుతోంది. ఆధ్యాత్మిక రంగానికి వస్తే, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వినుకొండ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ గిరి ప్రదక్షిణ రోడ్డును రూ. 1.85 కోట్లతో పూర్తి చేసి, రూ. 4.00 కోట్లతో ఘాట్ రోడ్డు పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధి కోసం రూ. 11.47 కోట్లు కేటాయించారు. ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించేందుకు బొల్లాపల్లి వద్ద రూ. 7.50 కోట్లతో ఎమ్ఎస్ఎమ్ఇ పార్క్ పనులు ప్రారంభమయ్యాయి. ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 33 లక్షలకు పైగా పెంచి, రూ. 98.72 కోట్ల వేతనాలను కూలీలకు అందించారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం ద్వారా 47,827 మంది తల్లులకు రూ. 62.17 కోట్ల లబ్ధి చేకూర్చారు. 'దీపం' పథకం కింద లబ్ధిదారుల సంఖ్యను 16,479కి పెంచి రూ. 1.48 కోట్లు కేటాయించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎమ్ఆర్ఎఫ్) ద్వారా రికార్డు స్థాయిలో 1,904 మంది బాధితులకు రూ. 12.75 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. రైతులకు 'అన్నదాత సుఖీభవ' కింద రూ. 20,000 చొప్పున 45,898 మంది రైతులకు రూ. 91.79 కోట్లు పంపిణీ చేశారు. వ్యవసాయాన్ని ఆధునీకరిస్తూ తొలిసారిగా 15 సబ్సిడీ డ్రోన్లను, 663 వ్యవసాయ పరికరాలను రూ. 3.15 కోట్లతో పంపిణీ చేశారు. గత ఐదేళ్ల పాలనలో పూర్తిగా పడకేసిన టిడ్కో (టిఐడిసిఒ) గృహాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని, రూ. 53.06 కోట్లతో 720 గృహాల పనులను శరవేగంగా పూర్తి చేస్తోంది. విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ. 19.11 కోట్లతో కొత్త లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు, రూ. 6.35 కోట్లతో రెండు కొత్త 33/11 కెవి సబ్ స్టేషన్ల పనులు ప్రారంభించారు. పిఎమ్ సూర్య ఘర్ పథకం ద్వారా 2000 మంది లబ్ధిదారులకు రూ. 30 కోట్ల ప్రయోజనం చేకూరింది. త్వరలోనే మిగిలిపోయిన ఎన్ఎస్పి సైటు డెవలప్మెంట్, నాగులవరం, సరికొండపాలెం రోడ్డు పనులన్నింటినీ పూర్తి చేసి వినుకొండను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని స్థానిక నాయకత్వం స్పష్టం చేసింది.

---

## ఓటర్ల సవరణ పారదర్శకంగా నిర్వహించాలి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 18)**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పారదర్శంగా నిర్వహించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్టీఐ వింగ్ కార్యదర్శి పిల్లి తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని చెరువుకొమ్ము పాలెం గ్రామంలో జరుగుతున్న ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని గురువారం పార్టీ కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లోను కాకుండా ఓటర్ల వివరాలు సక్రమంగా స్వీకరించాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ బీఎల్ఏలు కూడా ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించకుండా చూడాలన్నారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి ఎలాంటి అక్రమాలు జరిగిన వెంటనే ఎన్నికల ఉన్నతాధికారుల, పార్టీ ముఖ్య నాయకుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆయన వెంట పార్టీ గ్రామ అధ్యక్షుడు జడ్డు కృష్ణా రెడ్డి, ఉపాధ్యాక్షుడు గోపిరెడ్డి వెంకటరెడ్డి, నల్లగర్ల కోటేశ్వరరావు, భూమిరెడ్డి వాసుదేవరెడ్డి, చిలకల మధన్మోహనరెడ్డి పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో డాక్టర్ బిజెయస్ఆర్, సుభాష్ గాయత్రి

### జూనియర్ కళాశాలల విద్యార్థుల మార్కుల జోరు



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 18)**

రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన ఇంటర్మీడియేట్ ఫలితాలలో బద్వేల్ పట్టణంలోని డాక్టర్ బిజెయస్ఆర్, సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాలల విద్యార్థులు సీనియర్ ఇంటర్ ఫలితాలలో ఎంపీసీ విభాగంలో బి జాహ్నవి 989 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ గా నిలిచింది. బైపిసి విభాగము నందు సరిటాల అయేషా సుల్తానా 983 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ నిలిచింది. ఇంకా, పి.ధన్వి 985, బి. గుణవర్షిణి 985, ఎన్.సుదీక్షిత్ 982, యం. శివ నందిని 979, ఆర్.విజయ్ చంద్ర 979, కె.చంద్రమౌళిక 979, షేక్ యాసీన్ 976, పి.వెంకట కౌశిక 972, కె. సాయి సాత్విక 971 మార్కులు సాధించి టౌన్ టాప్‌గా నిలిచారు.

జూనియర్ ఇంటర్

ఎంపీసీ. విభాగం లో బిజివేముల జాహ్నవి 464/470, బిజివేముల వర్షిత 464/470, ఎస్.జాహ్నవి 462/470, ఇ బాలాజీ 462/470, మన్యం స్వర్ణకళ 461/470, సందా సూర్యచరణ్461/470, యాపరాల శ్రీవిద్య 460/470, నేలటూరి మల్లేశ్వరి 459/470, బీరం పుష్పలత 459/470, ఏ లక్ష్మీ ప్రణీత 458/470, సి వి మనీష్ కుమార్ 458/470, పోలు చర్ల సాహిత్య 455/470, బి పావని 453/470, జి దేవ వర్షిణి 453/470, కె శ్రావణి 451/470, కె నవీన 451/470 మార్కులు సాధించారు. ఇంకా బైపిసి విభాగంలో ఆర్ వెంకట సురేంద్ర 442/455, బి డోసిని 437/455, సయ్యద్ జహీదా తబస్సుమ్ 437/455, పి లక్ష్మీ పవిత్ర 418/455, యం ఈశ్రిన్ 407/455, బి మానస 404/455 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో బీరం సాయి దీప 470/500, కె.శ్రీ హర్షిత 441/500, ఎస్. సుభాన్ బి 426/500, వై శివ మహేశ్వరి 414/500 మార్కులు సాధించి టౌన్ టాప్ గా నిలిచారు. వీరిని డాక్టర్ బిజెయస్ఆర్ జూనియర్ కాలేజ్, సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు అభినందించారు. ఇంతటి విజయానికి కారణమైన విద్యార్థినీ, విద్యార్థులను, అధ్యాపకులను యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు.

---

## శుభ్రమైన మరుగుదొడ్లు ఆరోగ్యకరమైన జీవనానికి పునాది



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 18)**

"ఆపరేషన్ క్లీన్ స్వీప్" 4వ వారపు కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపాలిటీ కమిషనర్ పి శ్రీధర్ ఆదేశాల మేరకు కనిగిరి ఏపీఎస్ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ మహమ్మద్ సయానా బేగం ఆధ్వర్యంలో "శుభ్రమైన మరుగుదొడ్లు-ఆరోగ్యకరమైన జీవనం" అనే అంశంపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సౌజన్యంతో కనిగిరి పురపాలక సంఘం, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మహమ్మద్ సయానా బేగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మరుగుదొడ్ల పరిశుభ్రతను కాపాడుకోవడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు ప్రజా మరుగుదొడ్లను బాధ్యతాయుతంగా వినియోగించి ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్వచ్ఛమైన మరుగుదొడ్లు, పరిశుభ్రమైన పరిసరాలు ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అలాగే బహిరంగ మూత్ర విసర్జన, బహిరంగ మల విసర్జన చేయడం చట్టరీత్యా నిషేధించబడినదని, ప్రజలందరూ మరుగుదొడ్లను వినియోగించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. పరిశుభ్రతను పాటించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మహమ్మద్ సయానా బేగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ బాషా, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, సచివాలయ సిబ్బంది, పురపాలక సంఘం సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.

---

## నిర్మాపురంలో రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో వర్క్ షాప్ ఆన్ డైరీ





**(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, జూన్ 18)**

మండలంలోని నిర్మాపురం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్ సంస్థ వారి ఆధ్వర్యంలో వర్క్ షాప్ ఆన్ మండల్ లెవెల్ ప్రొడ్యూసర్ గ్రూప్ అండ్ బ్రీడ్ ఇంప్రూవ్మెంట్ ట్రూత్ కృత్రిమ గర్భధారణకు సంబంధించిన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంకేపల్లి వెటర్నరీ అసిస్టెంట్ నాయక్, గోపాలమిత్ర వైష్ణవి నిర్మాపురం గ్రామానికి సంబంధించిన డైరీ ప్రొడ్యూసర్ గ్రూప్ మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కరువు, వడగాలుల సమయంలో పశుసంపద సంరక్షణ, బ్రీడ్ ఇంప్రూవ్మెంట్ ట్రూత్ ఏఎల్ గురించి మాడ్యూల్స్ రూపంలో నాయక్, వైష్ణవి వివరించడం జరిగింది. అలాగే డైరీ ప్రొడ్యూసర్ గ్రూప్స్ యొక్క విధివిధానాలు, పాడి పరిశ్రమను ఎలా ఇంప్రూవ్మెంట్ చేసుకోవాలనే అంశాలు గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పాడి రైతులు, మండల కోఆర్డినేటర్ జి విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసు కొట్టివేత

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 18)**

హత్య కేసును కొట్టివేస్తూ మార్కాపురం ఆరవ అదనపు జిల్లా జడ్జి వేల్పుల భవాని గురువారం తీర్పునిచ్చారు. కేసు పూర్వాపరాల మేరకు ముండ్లమూరు మండలంలోని మారెళ్ళ గ్రామానికి చెందిన చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, అదే గ్రామానికి చెందిన చిరుమామిళ్ల ఈశ్వరయ్య కుటుంబీకులతో భూమి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2017 నవంబర్ 19న ఆయా కుటుంబీకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు ప్రత్యర్థుల దాడిలో మృతి చెందాడు. ఈ దాడిలో చిరుమామిళ్ల ఈశ్వరయ్య, చిరుమామిళ్ల హనుమంతరావు, చిరుమామిళ్ల పద్మావతి, చిరుమామిళ్ల కోటేశ్వరమ్మ నిందితులుగా అప్పట్లో హత్యకు గురైన వెంకటేశ్వర్లు భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు ముండ్లమూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. ఈ కేసులో సాక్షులను విచారించగా నేరం రుజువు కాలేదు. దీంతో హత్య కేసును కొట్టివేస్తూ జిల్లా అదనపు జడ్జి భవాని తీర్పునిచ్చారు. నిందితుల తరఫున న్యాయవాది మధిర శ్రీరామిరెడ్డి వాదించారు.

## పొగాకు రైతుల ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయండి



**(షణ్ముక వెలుగు, మద్రిపూడి, జూన్ 18)**

శుక్రవారం ఒంగోలులో పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ జరుగుతున్న ట్రాక్టర్ల ర్యాలీకి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రమేష్ తెలిపారు. గురువారం మద్రిపూడి మండల కేంద్రంలో పొగాకు రైతులతో మాట్లాడుతూ పొగాకు అమ్మకాలు ప్రారంభమై 60 రోజులు దాటిన కేవలం 10 శాతం మాత్రమే కొనుగోలు చేయడం రైతులకు ఆందోళన కలిగిస్తుందన్నారు. గత ఏడాది రైతులు బేరన్ కి రెండు నుంచి మూడు లక్షల నష్టపోగా ఈ సంవత్సరం క్వాలిటీ పొగాకు పండిన వారి ఆశలపై పొగాకు కంపెనీ నీళ్లు చల్లాయన్నారు. గరిష్ట గల 250 రూపాయలు చూపిస్తూ కనీస ధరను రోజురోజుకు తగ్గిస్తున్నాయని యుద్ధం వచ్చిందని,పంట ఎక్కువైందనిఏ చెబుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి పొగాకు ఎగిన ద్వారా 15 వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం డాలర్ల రూపంలోనూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మరో 76 వేల కోట్ల రూపాయలు వివిధ పన్నుల ద్వారా వస్తుందన్నారు. గతంలో రాష్ట్రానికి వచ్చే 20% వాటాను 50% పెంచిన ఫలితంగా మన రాష్ట్రానికి 11 వేల కోట్ల ఆదాయం వస్తున్న గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యాయన్నారు. గత ఏడాది రైతులకు నష్టం వచ్చిన ఐటీసీకి మాత్రం తొమ్మిది వేల కోట్ల పైగా లాభాలు వచ్చి ఆ కంపెనీ షేర్ విలువ ఆరు శాతానికి పైగా పెరిగిందని ఈ పరిస్థితుల్లో కంపెనీలు సిండికేట్ అయి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఉగాకు రైతుల గిట్టుబాటు ధర కోసం నేడు ఒంగోలులో జరుగు ట్రాక్టర్ ర్యాలీలో రైతులు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# వినుకొండలో కూటమి రెండేళ్ల విజయోత్సవ సభ



**వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, అభిమానులు**
**పట్టణంలో భారీ ర్యాలీ**
**హాజరైన ఎంపీ లావు, చీఫ్ విప్ జీవీ, ఎమ్మెల్యేలు కన్నా, బ్రహ్మారెడ్డి**





**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 18)**

రాష్ట్రంలో ప్రజా కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పల్నాడు జిల్లా వినుకొండలో గురువారం భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కార్యాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ర్యాలీకి మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ర్యాలీ వినుకొండ పట్టణంలోని సురేష్ మహల్ రోడ్డు మీదుగా నరసరావుపేట రోడ్డుకు చేరుకుని గంగినేని ఫంక్షన్ హాల్ వరకు సాగింది. అనంతరం గంగినేని ఫంక్షన్ హాల్‌లో భారీ బహిరంగ సభ అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు, అభిమానులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయం నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ గంగినేని ఫంక్షన్ హాల్ వరకు సాగింది. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొని వైసీపీ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలన రాష్ట్ర చరిత్రలోనే అత్యంత దుర్మార్గమైన పాలనగా నిలిచిందన్నారు. నాసిరకం బ్రాండ్ల మద్యాన్ని ప్రజలపై బలవంతంగా రుద్ది లక్షలాది కుటుంబాలను నాశనం చేశారని, అమాయకుల ప్రాణాలను బలిగొని జగన్ మోహన్ రెడ్డి వేల కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. "ఒక్క అవకాశం" అంటూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు. పెన్షన్‌ను ఒకేసారి రూ.1,000 పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేశారని, అమ్మఒడి పథకంలో కూడా ప్రజలను దగా చేశారని విమర్శించారు. అందుకే 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసి గట్టి తీర్పు ఇచ్చారని అన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు వర్గం అధికార బలంతో అనేక అరాచకాలకు పాల్పడిందని జీవీ ఆరోపించారు. హైదరాబాద్‌లో రూ.1,500 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.35 కోట్లకే కాజేయడానికి దొంగ జిరాక్స్ పత్రాలతో నాటకాలు ఆడి చివరకు జైలుకు వెళ్లే పరిస్థితి తెచ్చుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాబోయే రెండు మూడు నెలల్లో పెన్షన్లు, పేదలకు




ఇళ్ల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ప్రభావాన్ని తెలుసుకోవాలంటే నేరుగా లబ్ధిదారులతో మాట్లాడాలని అన్నారు. దేశంలో ఎక్కడా అమలు కాని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దీపం, స్త్రీ శక్తి, తల్లికి వందనం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు 45 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లే బాధ్యత నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్ర అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు అమలు చేయనున్నట్లు ఎంపీ తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం క్లస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నామని, కేంద్ర ప్రభుత్వ సబ్సిడీలతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. వినుకొండ నియోజకవర్గంలో ఐదు మహిళా క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రతి గ్రామానికి మౌలిక




సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డొంక రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఇప్పటికే 122 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. బొల్లపల్లి ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మాణం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని, నీటి వనరుల అభివృద్ధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సాగు, తాగునీటి అవసరాలను తీర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అమరావతి రాజధానికి వ్యతిరేకంగా నిలిచిన వైసీపీ వైఖరిని ప్రజలు ప్రశ్నించాలని లావు శ్రీకృష్ణదేవరాయలు పిలుపునిచ్చారు. అమరావతి విషయంలో వైసీపీ స్పష్టమైన వైఖరి ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బొల్లా బ్రహ్మనాయుడు భూ కబ్జా వ్యవహారంపై స్పందించిన ఆయన, బ్రహ్మనాయుడు ఎలాంటి మోసానికి గురికాలేదని, వందల కోట్ల రూపాయల విలువైన భూములను కబ్జా చేసేందుకు పక్కా ప్రణాళికతో కుట్రలు పన్నారని ఆరోపించారు. భూముల క్రమబద్ధీకరణ పేరుతో నకిలీ జీవోలు సృష్టించడం తీవ్రమైన నేరం కాదా అని ప్రశ్నించారు. ప్రజా వేదికలపై అసభ్యకరంగా మాట్లాడే బ్రహ్మనాయుడు, తాను చేసిన వ్యవహారాల కారణంగా డబ్బులు ఖర్చు చేసి జైలు నుంచి బయటకు వచ్చారని ఎద్దేవా చేశారు. ఈ వ్యవహారంపై వైసీపీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా శవ రాజకీయాలపై ఆధారపడిన పార్టీగా మారిందని తీవ్ర విమర్శలు చేశారు. సొంత తండ్రి మరణాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకున్న జగన్ మోహన్ రెడ్డి, పదవి రాకపోయినప్పుడు ఓదార్పు యాత్రల పేరిట శవయాత్రలు నిర్వహించారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సొంత కుటుంబ సభ్యులపైనే గొడ్డలిపోట్లు పొడిచారని విమర్శించారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై జరిగిన దాడులు, అన్యాయాలు దుర్యోధనుడు, రావణాసురుడు చేసిన అరాచకాలను తలపించే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. ప్రజల హక్కులను కాలరాస్తూ భయభ్రాంతులకు గురిచేసిన పాలనకు ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఇసుక విధానం పేరుతో 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని ధ్వజమెత్తారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పుట్టుకే ఒక పెద్ద రాజకీయ మోసమని వ్యాఖ్యానించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం అనే మాటలు కనుమరుగై బూతులు, బెదిరింపులు, దౌర్జన్యాలు మాత్రమే కనిపించాయని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి, పరిశ్రమలను తరిమికొట్టి, యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని ఆరోపించారు. ప్రజలు అన్నింటిని గమనించి కూటమికి చారిత్రాత్మక విజయం అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, టీటీడీ పాలక వర్గ సభ్యులు జంగా కృష్ణమూర్తి, కూటమి సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## గాండ్ల వెంకట్రావు ఆశయాల్ని ముందుకు తీసుకెళ్తాం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18)**



విప్లవ కమ్యూనిస్టు, ప్రజా వైద్యుడు, పౌర హక్కుల నేత కామ్రేడ్ గాండ్ల వెంకట్రావు ఆశయాలను ముందుకు తీసుకుపోవటమే మనం ఆయనకిచ్చే నివాళి అని ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఈదర హరిబాబు అన్నారు. గాండ్ల వెంకట్రావు 13వ వర్ధంతి సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రకాశం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణంలోని హైదరి ఆఫీసర్స్ క్లబ్‌లో అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు చొప్పర జాలన్న అధ్యక్షతన వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న హరిబాబు మాట్లాడుతూ గాండ్ల వెంకట్రావు నిజ జీవితంలో అనేక కష్టనష్టాలని అనుభవించారని, ప్రజల సమస్యలు ఎక్కడుంటే అక్కడ వాలిపోయే వారిని, ప్రజా వైద్యులుగా ఒంగోలు నగరం మొత్తం సైకిల్ ఎక్కి తిరుగుతూ ప్రజలకు వైద్యం చేసేవారన్నారు. ఎన్టీఆర్ కళాపరిషత్ ఆవిర్భవానికి గాండ్ల వెంకట్రావు కృషి మరువలేనిదన్నారు. తను నమ్ముకున్న ఆశయం కోసం చివరి వరకు కృషి చేసిన కామ్రేడ్ గాండ్ల నికార్సైన కమ్యూనిస్టు అన్నారు.. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి మాజీ రాష్ట్ర అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ జిల్లాలో జరిగిన అనేక పౌర హక్కుల ఉద్యమాలకు కామ్రేడ్ గాండ్ల వెంకట్రావు అండగా ఉండేవారన్నారు. పోలీసుల నిర్బంధాలను సైతం లెక్క చేయలేదన్నారు. తన ఆరోగ్యం కుంటుపడుతూ, మరొకవైపున తన కుటుంబం అనేక కష్టాల్లోకి వెళ్లినా కూడా తన చివరి జీవితం వరకు పేద ప్రజలకు అండగా ఉన్నారన్నారు. ఇంకా ఈ సభలో పడమట గాలి నాటక రచయిత డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో కళా రంగం రెండు వర్గాలుగా ఉండేదని, ఒకటే సాధారణ కళా రంగం, మరొకటి వర్గ రూప కళారంగమని, అటువంటి దాంట్లో వెంకట్రావు వర్గ రూప కళా రంగాన్ని ఎన్నుకొని దానికోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు రామకృష్ణ, పికేయం జిల్లా కన్వీనర్ పి శీను, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, రంగ భూమి కళాకారుల సంఘం అంగలకుర్తి ప్రసాదు, పొన్నూరు వెంకట శ్రీనివాసులు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి సి ఎస్ సాగర్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ,అరుణోదయ జిల్లా నాయకుడు దారా సుబ్బారావు, నాతాని హనుమంతరావు, మహాలక్ష్మి, జానకి మాట్లాడగా ప్రజా కళామండలి నాయకులు విప్లవగేయాలు ఆలపించారు. నూకతోటి శరత్ బాబు, జయరావు, ప్రజల పాటలు పాడారు.

## చెన్నారెడ్డిపల్లె సచివాలయంలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ

**సమయపాలన పాటించకుండా విధులకు డుమ్మా కొట్టేవారిపై చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 18)**



రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజానీకం మండల కేంద్రానికి తమ సమస్యల పరిష్కారం కోసం, సంక్షేమం పథకాల కోసం, భూసమస్యలు, ఇతర సమస్యల పరిష్కార నిమిత్తం మండల కేంద్రానికి వచ్చేవారు. కానీ వారు పనులు మానుకొని ఎంతో వ్యయ ప్రయాసాలతో మండల కేంద్రానికి వచ్చిన ఎడల అక్కడ సంబంధిత అధికారులు సమయానికి ఉండకపోవడం, వారు ఎప్పుడు ఉంటారో, ఎప్పుడు ఉండరో తెలియక మండల కేంద్రానికి చెప్పులు అరిగిపోయేలా కార్యాలయాల చుట్టూ మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు తిరుగుతుండేవారు. దీంతో ప్రజలు మానసికంగా, ఆర్థికంగా, శారీరకంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొనేవారు. ఇలాంటి సమస్యలను చవిచూసిన గత ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కారమయ్యే దిశగా జనాభా ప్రాతిపదికగా ప్రతి పంచాయతీలో సచివాలయాలను యుద్ధ ప్రాతిపదికన గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో గ్రామీణ ప్రజలు ఊపిరిపీల్చుకున్న వైనం పాఠకులకు విధితమే. దీంతో ఆయా సచివాలయాల సిబ్బంది మండల కేంద్రానికి రావలసిన పరిస్థితి లేదు. ఇదే అదునుగా భావించిన సచివాలయాల సిబ్బంది సకాలంలో కార్యాలయానికి రాక ప్రజా సమస్యలను పరిష్కరించేవారు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ తర్లుపాడు మండలంలో సచివాలయాల ఎదుట బాధితులు అనేక సార్లు ధర్నాలు, నిరసనలు చేయడం జరిగింది. దీన్ని గమనించిన ప్రస్తుత ప్రభుత్వ జిల్లా ఉన్నతాధికారిని ఎం విజయ సునీత మండలంలోని సచివాలయాలకు సకాలంలో ఎవరు విధులకు హాజరవుతున్నారు. ఎవరు విధులకు డుమ్మా కొడుతు హాజరైనట్లు హాజరు వేసుకుంటున్నారో అందుకు ఏ అధికారి వారికి సహకరిస్తున్నారో అలాంటి వారి పై కఠినమైన చర్యలు చేపట్టేందుకు గురువారం మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తర్లుపాడు మండలంలోని చెన్నారెడ్డిపల్లి సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన ప్రకారం నిర్ణీత సమయానికి సచివాలయాలకు హాజరు కాని వారి పై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పదని ఆమె హెచ్చరించారు. దీంతో విధులకు సకాలంలో రాకుండా డుమ్మా కొట్టే సచివాలయాల సిబ్బంకి వారికి సహకరించే అధికారికి తలనొప్పిగా మారినట్లు వారందరూ తలలు పట్టుకుంటున్న పరిస్థితి ఈ మండలంలో ఏర్పడిందని అందరు అప్రమత్తంగా ఉండవలసిన పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది గుసగుసలాడుకుంటున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం విజయ సునీత వెంట సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ అంటే దోచుకోవడం... పంచుకోవటం
# వినుకొండ బహిరంగ సభలో బీటీ నాయుడు ధ్వజం



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 18)**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా వినుకొండ పట్టణంలోని గంగినేని ఫంక్షన్ హాల్ లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య వక్తగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్ బెందుల తిరుమల నాయుడు (బీటీ నాయుడు) మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తన బాపట్ల పర్యటనలో ఒక వృద్ధుడితో జరిగిన సంభాషణను గుర్తుచేసుకుంటూ, రామాయణాన్ని "కట్టా, కొట్టా, తెచ్చా" అని మూడు ముక్కల్లో చెప్పినట్లుగా, గత ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని "దోచుకోవడం, దాచుకోవడం" అనే రెండే రెండు మాటలలో ముగించవచ్చని ఆయన ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో 10 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెడితే, కేవలం 3 లక్షల కోట్లు మాత్రమే ఖర్చు చేసి, మిగిలిన 7 లక్షల కోట్లు ఎక్కడికి పోయాయో ప్రజలు ఆలోచించాలని, ఆ డబ్బుతోనే బెంగళూరు, హైదరాబాద్, తాడేపల్లిలో భారీ కొంపలు కట్టుకుని దాచుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలను ఎండగడుతూ, కరోనా సమయంలో కనీసం మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్ గారిని గుండు కొట్టించి, రోడ్డుపై పడేసి ఆయన ఆత్మహత్యకు కారణమయ్యారని బీటీ నాయుడు మండిపడ్డారు. అలాగే దళిత సోదరుడు, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను ముక్కలు ముక్కలుగా నరికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ సిగ్గులేకుండా పార్శిల్ చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, జేసీ సోదరులతో పాటు ఎంతో మంది నాయకులపై అక్రమ కేసులు పెట్టారని, తనపై కూడా ఆ నాడు 28 అక్రమ కేసులు బుక్ చేశారని గుర్తుచేశారు. నాడు కర్నూలు జిల్లాలో ఉన్న తమ ప్రియతమ నాయకుడు చంద్రబాబు నాయుడు గారిని అర్ధరాత్రి వేళ 500 మంది పోలీసులతో అక్రమంగా అరెస్ట్ చేసి 53 రోజులు ఇబ్బంది పెట్టారని, గురువులైన టీచర్లను వైన్ షాపులు, బాత్‌రూమ్‌ల దగ్గర కాపలా పెట్టి అవమానించారని ఆరోపించారు. పత్రాలు లేకుండా ఫోర్జరీ సంతకాలతో రూ.1,545 కోట్ల భూ కుంభకోణానికి పాల్పడిన వినుకొండ వైఎస్సార్‌సీపీ నాయకుడు బ్రహ్మానందరెడ్డి ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నాడని, ఈ అరాచకాల వల్లే గత ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీ 151 సీట్ల నుండి కేవలం 11 సీట్లకు పరిమితం చేస్తూ ఐదు తీసేసి బుద్ధి చెప్పారని దుయ్యబట్టారు. అయినప్పటికీ జగన్ మోహన్ రెడ్డి మారకుండా సప్త సముద్రాల అవతల ఉన్నా సరే అధికారులను తీసుకొచ్చి ఏదో చేస్తానని బెదిరిస్తున్నాడని, బెంగళూరు లోటస్ పౌండ్‌లో కూర్చుని చూస్తున్న జగన్‌కు వినపడేలా కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలని ప్రజలతో నినాదాలు చేయించారు. ఇదే సమయంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సూపర్ సిక్స్' పథకాల ప్రగతిని బీటీ నాయుడు ప్రజలకు వివరించారు. కూటమి నాయకులందరూ ఏకమై ప్రజల ఆశీర్వాదంతో 164 సీట్లు సాధించి, చంద్రబాబు నాయుడు గారిని ముఖ్యమంత్రిని, కేంద్రంలో నరేంద్ర మోదీ గారిని ప్రధానమంత్రిని చేసుకున్న ఫలితంగా ఈ సంక్షేమ పాలన సాధ్యమైందని అన్నారు. 'తల్లికి వందనం' పథకం కింద ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.13,000 చొప్పున అందిస్తున్నామని, రాయలసీమలో ఒకే ఇంట్లో తొమ్మిది మంది పిల్లలకు ఈ లబ్ధి చేకూరిందని చెప్తూ, గతంలో జగన్ దీనిని ఒక్కరికే పరిమితం చేసి మోసం చేశాడని విమర్శించారు. 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, 'దీపం' పథకం కింద ప్రతి ఇంటికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. రైతులకు ఈ నెల 20వ తేదీన మూడో విడత కింద రూ.20,000 పెట్టుబడి సాయం నేరుగా ఖాతాల్లో పడబోతోందని వెల్లడించారు. గత ప్రభుత్వం పేదల కడుపు కొట్టి అన్న క్యాంటీన్లను మూసివేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మళ్లీ ప్రారంభించి కేవలం రూ.5 లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేదలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తోందని అన్నారు. 'ఎన్టీఆర్ భరోసా' కింద పెన్షన్ ను రూ.4,000 కు పెంచి స్వయంగా ముఖ్యమంత్రే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందిస్తున్నారని, వికలాంగులకు రూ.6,000 నుండి రూ.15,000 వరకు ఇస్తున్నామని చెప్పారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆగిపోతే, నారా లోకేష్ బాబు గారు మహానాడు వేదికగా మహిళలకు 33% రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారని, రాబోయే రోజుల్లో మహిళలు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కాబోతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఎండను, ఉక్కపోతను కూడా లెక్కచేయకుండా బ్రహ్మాండమైన ఊరేగింపుతో ఈ సభకు తరలివచ్చిన జనసందోహానికి తలవంచి నమస్కరిస్తున్నానని, సంక్షేమము, అభివృద్ధి, సుపరిపాలనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీటీ నాయుడు స్పష్టం చేశారు.

## జాతీయ లోక్ అదాలత్ కేసులు పరిష్కరించుకునే ఒక ప్రత్యామ్నాయ వేదిక

జిల్లా ప్రధాన న్యాయమూర్తి,
జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఏ సత్యానంద్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18)**

జాతీయ లోక్ అదాలత్ అనేది కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను, వివాదాలను ఇరువర్గాల అంగీకారంతో సామరస్యంగా పరిష్కరించుకునే ఒక ప్రత్యామ్నాయ వేదిక. 'నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ' ఆధ్వర్యంలో ఇవి దేశవ్యాప్తంగా నిర్వహించబడతాయని, జాతీయ అదాలత్‌లో రాజీ ద్వారా వ్యాజ్యాన్ని పరిష్కరించుకోవడం అనేది ఇరు వర్గాలు గెలిచినట్టే భావించ బడతారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఏ సత్యానంద్ అన్నారు. గురువారం జిల్లా న్యాయస్థాన ప్రాంగణం ఒంగోలులో ప్రకాశం జిల్లాలోని పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ఇరు వర్గాల ఆమోదంతో వ్యాజ్యాలు పరిష్కారం కోసం న్యాయవ్యవస్థతో సమన్వయం చేసుకొని పోలీస్‌శాఖ కూడా జాతీయ లోకదాలత్ లో కేసులు పరిష్కారం కోసం సహకరించాలని జూలై 11వ తేదీ రెండో శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కారం కోసం ప్రయత్నించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి టి రాజ్యలక్ష్మి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి సిహెచ్‌వి రామకృష్ణ, డివిజనల్ స్థాయి పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## నాలుగు రోజుల్లో 31 మంది పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నిందితులను కోర్టులో హాజరుపరిచిన ఎస్ఐ శివకృష్ణారెడ్డి
30 మందికి రూ.10 వేల జరిమానా,
ఒకరికి జరిమానాతో పాటు 15 రోజుల జైలు శిక్ష



**(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 18)**

మార్కాపురం జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కంభం ఎస్ఐ ఎ శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 31 మందిని గడచిన నాలుగు రోజులలో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సీహెచ్ రమేష్ ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం 30 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించగా, మరో వ్యక్తికి రూ.10 వేల జరిమానాతో పాటు 15 రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకృష్ణారెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడిపితే శిక్ష తప్పదు అని ఎస్ఐ శివకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.

## శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం




**(షణ్ముఖ వెలుగు, కారంచేడు, జూన్ 18)**

బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పీ ఎమ్ డి మోయిన్ సూచనలతో ఇంకొల్లు సిఐ ఎం రామనాయక్, కారంచేడు ఎస్ఐ ఖాదర్ బాషాల ఆధ్వర్యంలో చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం గురువారం కారంచేడు మండలం, స్వర్ణ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు 'శక్తి యాప్' వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కారంచేడు ఏఎస్ఐ ఏ శివారెడ్డి, శక్తి టీం కానిస్టేబుల్ కె సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం వి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ఏ శివారెడ్డి మాట్లాడుతూ హైస్కూల్ విద్యార్థినుల పట్ల ఆకతాయిలు చేసే వేధింపులు వారి విద్యాభ్యాసం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. బస్టాప్‌లు, హైస్కూల్ పరిసరాలు, ప్రజా ప్రదేశాలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ఈవ్‌టీజింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, వెంటపడటం, బెదిరింపులు వంటి వేధింపులను సహించకూడదని విద్యార్థినులకు సూచించారు. ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు వెంటనే 'శక్తి యాప్' ద్వారా లేదా 112 నెంబరుకు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.సమాజంలోని ప్రతి ఒక్కరూ మహిళల గౌరవాన్ని కాపాడే బాధ్యతను గుర్తించాలన్నారు. వేధింపులు లేని విద్యా వాతావరణాన్ని నిర్మించేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, విద్యార్థినులు చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలన, త్మరక్షణ నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, చట్టాలపై అవగాహన పెంచుకుని తమ హక్కులను తెలుసుకోవడం ఎంతో అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో కారంచేడు ఏఎస్ఐ ఏ శివారెడ్డి, శక్తి టీం కానిస్టేబుల్ కె సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యంవి సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 18)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు కందుల విగ్నేష్‌రెడ్డి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి స్వయంగా వారి ఇండ్లకు వెళ్లి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులను అందుకున్న వారిలో పొదిలి మండలం పొదిలి సుబ్బాయమ్మ (అక్కచెరువు) రూ.1,02,619, గోగినేని సుబ్బారావు (గోగినేనివారిపాలెం) రూ.77,314, పోలుదాసు వెంకటనారాయణ (కంబాలపాడు) రూ.1,21,810, చాతరాశి శ్రీనివాసరావు (కంభాలపాడు) రూ.54,696, తానికొండ సురేష్ బాబు (కాటూరివారిపాలెం) రూ.1,15,466, మీగడ పెద్ద ఓబుల్‌రెడ్డి (మాదాలవారిపాలెం) రూ.51,963, మైలపెద్ద వెంకటసుబ్బయ్య (పోతవరం) రూ.51,309, మలినేని బ్రహ్మయ్య (సల్లూరు) రూ.56,300, గోగినేని వెంకటేశ్వర్లు (ఉప్పలపాడు) రూ.1,06,930, నేలటూరి చిన్న కొండయ్య (కంబాలపాడు) రూ.25,688 వెరసి మొత్తంగా రూ.7,64,095 ల చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లిఖార్జున, పొదిలి మండల, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు, షేక్ కాలేషా, సోమయ్య, సుబ్బయ్య, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








## రానున్న కార్యక్రమాలలో ప్రతి ఉద్యోగి చురుకుగా పాల్గొనాలి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18)**

ఏపీజేఏసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్, ఉద్యమ కార్యచరణ కమిటీ చైర్మన్ ఫణి పేరాజు ఉద్యోగుల హక్కుల సాధన కోసం చేపట్టిన కార్యాచరణలో భాగంగా జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదనరావు , జిల్లా కార్యవర్గ సభ్యులతో ఒంగోలు ఆర్‌టిసి కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగులను కలిసి మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల హక్కుల సాధన, వివిధ సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ పై విస్తృతంగా చర్చించారు. రానున్న కార్యక్రమాలలో ప్రతి ఉద్యోగి చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఏపీఎస్ఆర్‌టీసీ బస్సు సౌకర్యం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18)**

నీట్ యుజీ పునఃపరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ ఆధారంగా, తమ నివాసం నుండి పరీక్షా కేంద్రానికి , తిరిగి రావడానికి ఏపీఎస్ఆర్‌టీసీ వారి ఎక్స్ ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సులలో ఉచితంగా ప్రయాణించడానికి అనుమతించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా మార్గనిర్దేశం చేయడానికి అన్ని బస్సు స్టేషన్లలో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయటమైనది. కావున నీట్ యుజీ పునఃపరీక్షకు హాజరయ్యే విద్యార్థులు, ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని, తమ హాల్ టికెట్ చూపి, తమ నివాసం నుండి పరీక్షా కేంద్రానికి నిర్ణీత సమయంలోగా చేరుకోవాల్సిందిగా తెలిపారు.

## మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవ మణికేశ్వరంలో తీరిన లో వోల్టేజ్ సమస్య

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 18)**



మణికేశ్వరం గ్రామంలోని ఎస్సీ కాలనీ కొండమీద ప్రాంతం, రచ్చబండ పై బజారు ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక లో-వోల్టేజ్ సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది. స్థానిక తెదేపా నేతలు ఈ సమస్యను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో విద్యుత్ శాఖ అధికారులు ఈరోజు గ్రామంలో రెండు నూతన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. తమ ఇబ్బందులను త్వరితగతిన తీర్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు మణికేశ్వరం గ్రామ పెద్దలు, ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆదినారాయణ, మాధ్యూస్, బలరామిరెడ్డి, రాంబాబు, అబ్రహాం, ఫకీర్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ర్యాలీకి సీపీఎం సంపూర్ణ మద్దతు పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం అవసరం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18)



పొగాకు రైతుల సమస్యల పరిష్కారం, గిట్టుబాటు ధర సాధన కోసం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో 19వ తేదీన ఒంగోలులో నిర్వహించనున్న ట్రాక్టర్ ర్యాలీకి సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ పార్టీ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పొగాకు రైతులు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ఈ ఉద్యమానికి అన్ని వర్గాల రైతులు, ప్రజలు సంఘీభావం ప్రకటించాలని ఆయన కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే 1000 కోట్ల రూపాయలు కేటాయించి రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకును ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి వీడి స్పందించాలని, రైతుల ప్రయోజనాల కోసం చేపడుతున్న ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ పిలుపునిచ్చినట్లు తెలిపారు.

## మండల వైసిపి యువజన విభాగం అధ్యక్షుడిగా ఎస్ఎండి రఫీ నియామకం

(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 18)




వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కమిటీలో భాగంగా గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం పట్టణంలో నాయక్ స్ట్రీట్ ఎంపీటీసీ 2 సభ్యులుగా ఉన్న ఎస్ ఎండి రఫీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కంభం మండల యువజన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా నియమింపబడ్డారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఆదేశాలను పాటిస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేలా కృషి చేస్తానని తెలిపారు.

## రావిగుంటపల్లి ఎస్సీ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి పిలుస్తుంది





(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 18)

మండలంలోని రావిగుంటపల్లి ఎస్సీ అంగన్వాడీ కేంద్రం నందు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో "అంగన్వాడి పిలుస్తుంది" కార్యక్రమం నిర్వహించారు. తల్లులు, కిశోర బాలికలతో పార్వతి మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను "అమ్మ ఒడిలాంటి అంగన్వాడీ" కేంద్రానికి పంపాలని ఆటపాటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా ప్రీస్కూల్ విద్య, పౌష్టికాహారంతో పాటు ఆరోగ్యం, భద్రత ఉన్నదని శిక్షణ పొందిన అంగన్వాడీ టీచర్లు టిఎల్ఎంతో ప్రైవేటు పాఠశాలల కన్నా మిన్నగా బోధిస్తారని, ఫీజులు ఎందుకు దండగ, అంగన్వాడీలు ఉండగా, అని అంగన్వాడి సేవలను గూర్చి అవగాహన కల్పించారు. తదుపరి గ్రామంలో అంగన్వాడీ పిలుస్తోంది, అవగాహన ర్యాలీని నినాదాలతో నిర్వహించారు. అనంతరం గృహ సందర్శన చేసి తల్లిదండ్రులతో కలసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు పి శ్రీనివాసులు, అంగన్వాడీ కార్యకర్తలు వై అన్నపూర్ణమ్మ, బి జయలక్ష్మి, ఏ మంజుల, గ్రామంలో తల్లులు, కిశోర బాలికలు, పిల్లలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### 250 మందికి పైగా వైద్య సేవలు
### 15 రకాల వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు
### కిమ్స్ ఆసుపత్రి సహకారంతో శిబిరం ఏర్పాటు









(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 18)

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. క్యాన్సర్ మరియు మూత్రపిండాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలతో పాటు 15 రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి 250 మందికి పైగా రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ,ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రోగులను పలకరించి వారి ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రక్త పరీక్షలు, బిపి చెకప్, క్రియాటిన్, ఈసీజీ, పాప్ స్మియర్, మెమోగ్రఫి, ఇంకా జనరల్ వైద్య సేవలను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధపడే పేదల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అధికంగా నిధులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 1362 మందికి 10.68 కోట్ల రూపాయల సహాయం అందించామన్నారు. కందుకూరు నియోజకవర్గంలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా సుమారు 33 కోట్ల రూపాయల విలువైన సేవలు అందాయని నాగేశ్వరరావు తెలిపారు. ఇంకా పేదలకు సౌకర్యంగా ఉండేలా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కిమ్స్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ మరియు ఈహెచ్ఎస్ పథకాల ద్వారా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ వంటి ఆధునిక వైద్య సేవలతో పాటు మూత్రపిండాల సంబంధిత రోగులకు డయాలసిస్ సేవలు కూడా అందించడం సంతోషకరమని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. అలాగే కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్, జీవన్ దాన్ రిజిస్ట్రేషన్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న వారందరికీ ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాట్లు చేశారు. వైద్యులు రమణారెడ్డి, హేమంత్, హరికాంత్, వెంకట రమణారెడ్డి, సృజన వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, సీనియర్ నాయకులు ఉప్పుటూరి శ్రీను, కంద్రా మాల్యాద్రి, నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, టిడిపి నేతలు కాకుమాని హర్ష, భవనాసి వెంకటేశ్వర్లు, ఘట్టమనేని సుబ్బారావు, చెరుకూరి సూర్యనారాయణ, మచ్చా మనోహర్, నాదెండ్ల మధు, రాధాకృష్ణ, శ్రావణ్, జనసేన నాయకులు కళ్యాణ్, బుచ్చయ్య గుప్తా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## చట్ట సవరణ ద్వారా టెట్ నుంచి మినహాయింపు కల్పించాలి






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18)

ఏబిఆర్యస్యం పిలుపు మేరకు ఆర్టీఈ చట్ట సవరణ ద్వారా 2010 టెట్ నోటిఫికేషన్ కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులను టెట్ తప్పనిసరి ఉత్తీర్ణత నుండి మినహాయింపు కల్పించవలసిందిగా ఏపి ఉపాధ్యాయ సంఘం ప్రకాశం జిల్లా శాఖ తరుపున జిల్లా కలెక్టర్ పి రాజాబాబుకు వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లా కలెక్టర్ ద్వారా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడులకు వినతిపత్రాన్ని అందజేశారు. ముందుగా నిరసన తెలియజేసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆపస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సిహెచ్ శ్రావణ కుమార్ మాట్లాడుతూ ఇన్సర్వీస్ ఉపాధ్యాయలకు టెట్ నుండి పార్లమెంట్లో చట్ట సవరణ ద్వారా మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇటీవల భారత సర్వోన్నత న్యాయస్థానం 2010 టెట్ నోటిఫికేషన్కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులు కూడా ప్రస్తుతం తప్పనిసరిగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణత పొందాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పు నేపథ్యంతో 2010 టెట్ నోటిఫికేషన్కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత, పదోన్నతి పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పార్లమెంట్ లో చట్టసవరణ ద్వారా ఉపాధ్యాయులు టెట్ తప్పనిసరి ఉత్తీర్ణత నియమము 2010 టెట్ నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుండి అమలు చేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఏపీయుఎస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సీహెచ్ శ్రావణకుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె మల్లికార్జునరావు, టి దిలీప్ చక్రవర్తి, జిల్లా బాధ్యులు బీవీఎస్ గుణప్రసాద్, వి చంద్రశేఖర్, కె నరసింహ, పి గంగాధర్, టీవీటీ రవిచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 50 శాతం సబ్సిడీతో పచ్చి రొట్ట ఎరువుల పంపిణీ

### మండల వ్యవసాయాధికారి డి విజయకుమార్

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 18)



రైతులు ప్రధాన పంటకు ముందు పచ్చి రొట్ట ఎరువులయిన జానుము, జీలుగ, పిల్లిపెసర పంటలు సాగు చేసి పూత సమయంలో కలియ దున్నితే నేల గుల్లబారి, నీరు నిల్వ ఉంచుకొనే సామర్థ్యం పెరిగి సేంద్రియ కర్బనం పెరుగుతుందని అలాగే నత్రజని హెక్టారుకు 40 నుండి 80 కిలోలు అందుతుందని తెలియజేసారు. జీలుగ, జనుము ఎకరాకు 10 కేజీలు, పిల్లిపెసర 8కేజీలు గరిష్టంగా 5 ఎకరాల వరకు అందజేయడం జరుగుతుందని, ధర విషయంలో రైతు చెల్లించవలసినది జనుము కేజీ 70రూపాయలు, జీలుగ 80 రూపాయలు, పిల్లిపెసర 98 రూపాయలు ఉంటుంది కాబట్టి కావలసిన రైతులు మీ ఆధార్ కార్డు, పొలం పాసుబుక్ జిరాక్స్, మొబైల్ ఫోన్ తీసుకొని మీ రైతు సేవాకేంద్ర సిబ్బందిని సంప్రదించాలని తెలియజేసారు.

## సర్ వెరిఫికేషన్ పై వైసీపీ నాయకుల క్షేత్రపరిశీలన



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 18)

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి సూచన మేరకు పర్చూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి బాధ్యులు, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా వైఎస్సార్సీపీ నాయకులు కొత్తపాలెం పంచాయతీ భాగ్యనగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి ఓటర్ల జాబితా పరిశీలన, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, ఎవరూ అన్యాయానికి గురికాకుండా చూడడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.గ్రామస్తులతో సమావేశమై వెరిఫికేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ, ఎస్ఐఆర్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరగాలని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగించబడకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలు కూడా తమ వివరాలను సక్రమంగా పరిశీలించి, అవసరమైతే సంబంధిత పత్రాలను సమర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొల్లాటి ఏడుకొండలు, మండల వైఎస్సార్సీపీ ఉపాధ్యక్షుడు మేడికొండ సునీల్, కొత్తపాలెం పంచాయతీ కన్వీనర్ గుమ్మడి ఉమాశంకర్ రెడ్డి, మండల క్రిస్టియన్ సెల్ కన్వీనర్ మేడికొండ బాబురావు, బిఎల్ఎలు ఆసోది సూర్యనారాయణ రెడ్డి, దండ్రుపోలు నాగరాజు, వాటుపల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# రోడ్డు ప్రమాద దళిత మహిళల శవాలకు న్యాయం చేయాలి





- ▶రెండు రోజులుగా ఒంగోలు మార్చురీ రూమ్ లోనే లంబాడి, మాదిగ మహిళల శవాలు
- ▶కమ్మని దేశం యమకింకరుడుకు డ్రంక్ అండ్ టెస్ట్ నిర్వహించని తాలూకా సిఐ
- ▶మార్చురీలో పోస్ట్‌మార్టం చేయకుండా ఏసి బంద్ చేసిన గవర్నమెంట్ డాక్టర్లు
- ▶రెండు రోజులైన బాధితులకు ఎఫ్ఐఆర్ ఇవ్వని తాలూకా పోలీసులు
- ▶ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని దళిత నేత నేలం డిమాండ్
- ▶బాధితులను దళిత నాయకులను అరెస్టు చేసి కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించిన కూటమి ప్రభుత్వం ఖాకీలు
- ▶రూ.3,50,000 బాధితురాలికి సాధించిన దళిత నాయకులు








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18)

మంగళవారం ఒంగోలులో యమకింకరుడిలా మారి మహిళల ప్రాణాలు తీసిన తెలుగుదేశం నాయకుడు తొట్టెంపూడి మల్లికార్జునరావును అరెస్టు చేయాలని ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ ముందు దళితులు ఆందోళన చేశారు. బుధవారం తాలూకా ఎస్ఐ సుదర్శన్ హై డ్రామా నడిపి బాధితులకు ఎఫ్ఐఆర్ ఇవ్వలేదు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య స్వస్థలమైన తూర్పు నాయుడుపాలెం ఈ మహిళల ప్రాణాలు తీసిన తొట్టెంపూడి మల్లికార్జునరావు కావటం గమనార్హం మత్తులో కారు నడిపి రోడ్డు పక్కన ఉన్న మహిళలను పరలోకానికి పంపించి మరల మోటర్ సైకిల్ పై వెళుతున్న మాదిగ మహిళలను చంపి మరో మహిళను చావు బతుకుల మధ్య గుంటూరు ఐసీయూలో ఉంచిన పచ్చని పార్టీ రక్త బంధువు కావటంతో ఒంగోలు తాలూకా పోలీసులు కమ్మని ఖాకి ప్రేమతో మహిళల పాలిట యమకింకరుడు అయిన తొట్టెంపూడి కి డ్రంక్ అండ్ టెస్ట్ కూడా చేయించలేదు. బాధితులకు ఎఫ్ఐఆర్ కూడా ఇవ్వలేదు. రాజీ పేరుతో పలనాడు నుండి వచ్చిన లంబాడి యువతి భాజీ భాయ్ బంధువులను కాలయాపన చేయించారు. శవాలను మార్చురీలో పెట్టి పోస్టుమార్టం చేయలేదు. ప్రభుత్వ ప్రతినిధులుగా ఒంగోలు ఎమ్మార్వో కానీ ఆర్డీవో కానీ తొంగి చూడలేదు. అలాగే ఎస్సీ వెల్ఫేర్ ఎస్టి వెల్ఫేర్ అధికారులు కూడా జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఉండి కూడా లంబాడి, మాదిగలను కన్నెత్తి చూడలేదు. అమెరికాలో అగ్రకులాలు చనిపోతే ప్రత్యేక విమానాల్లో ఇండియాకి తీసుకువచ్చే కూటమి ప్రభుత్వ మంత్రులు ఎమ్మెల్యేలు, కూటమి ప్రాక్టీకి చెందిన జక్కంపూడి మల్లికార్జునరావు అనే యమకింకరుడు మహిళల ప్రాణాలు తీస్తే ఒంగోలులో రెండేళ్ల విజయోత్సవ సభ జరుపుకుంటూ కూడా రిమ్స్ వద్దకు రాలేదన్నారు. మార్చురీ రూములో మహిళల సేవలను కుల్లబెట్టాలని ఏసి బందు చేసి నోటీస్ బోర్డు కూడా తగిలించారన్నారు. తాము ఫోరెన్సిక్ విభాగాధిపతి మమతతో మాట్లాడి ఏసీ మెకానిక్ ను తెప్పించి రిపేర్ చేయించామన్నారు. తాలూకా సిఐ కానీ ఒంగోలు డి.ఎస్.పి కానీ బాధితుల వద్దకు రాలేదన్నారు. అలాగే జిల్లా కేంద్రమైన ఒంగోలులో కలెక్టర్ రాజబాబు కూడా ఎస్సీ ఎస్టీ మహిళల యాక్సిడెంట్ విషయమై అధికారులు ఎవరిని పంపించలేదన్నారు. ఈ విషయమై ఒంగోలు నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభలో ఉన్న మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బి. ఎన్ విజయ్ కుమారులను జిల్లా కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేయటానికి బయలుదేరిన దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, మాజీ ఎస్టీ కమిషన్ నెంబర్ శంకర్ నాయక్ కెవిపిఎస్ నాయకులు రఘురాం మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య లను పోలీసులు అడ్డుకున్నారు ఏ ఆర్ పోలీసులను తెప్పించి ఒంగోలు వన్ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు సంతనూతలపాడు ఎస్సై అజయ్ బాబు తాలూకా ఎస్ఐ సుదర్శన్ తదితర పోలీసులు పోలీసువానులో లంబాడి మహిళలను సైతం ఎక్కించి కొత్తపట్నం పోలీస్ స్టేషన్ లో సాయంత్రం వరకు నిర్బంధించారు. తాను వాట్సాప్ ద్వారా జిల్లా కలెక్టర్ రాజబాబుకు ఈ విషయమై ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన రాజబాబు ఒంగోలు డిఆర్ఓ మాధురి చేత ఫోన్ చేయించి ఒంగోలు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు ఒంగోలు తహసిల్దార్ కృష్ణమోహన్ ను రిమ్స్ వద్దకు పంపించారన్నారు. ఇంతలో ఒంగోలు తెలుగుదేశం నాయకుడు వెంకట్రావు కూటమి ప్రభుత్వంతో మాట్లాడి 3,50,000 రూపాయలు మరణించిన మహిళకు ఇవ్వటానికి అంగీకరించారు.

## చిన్నగంజాం మండలాన్ని చీరాల కోర్టు పరిధిలోనే కొనసాగించాలి




(షణ్ముఖ వెలుగు, చీరాల, జూన్ 18)

చిన్నగంజాం మండలాన్ని చీరాల కోర్టు పరిధిలోని కొనసాగించాలని మండల ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ జి ప్రతాప్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక మండల కార్యాలయం నందు జరిగిన కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ జి ప్రతాప్ కుమార్ అధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ సుజాతకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ చీరాల కోర్టు పరిధిలో ఉన్న చిన్నగంజాం మండలాన్ని పర్చూరు కోర్టు పరిధిలోకి మార్చటం అన్యాయమని అన్నారు. చిన్నగంజాం మండలంలోని 12 గ్రామాలు ప్రజలు ఈ చర్యలను వ్యతిరేకిస్తున్నారని చిన్నగంజాం-ఇంకొల్లు-పర్చూరు మార్గాల్లో ప్రయాణ సౌకర్యాలు అంతంత మాత్రమే అని పర్చూరు వేళ్ళాటానికి ప్రయాణం చార్జీలు భారం అధికంగా ఉంటుందని పరిస్థితులను అర్థం చేసుకొని మండల ప్రజలకు చీరాల కోర్టు పరిధిలోనే కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కత్తి నాగేంద్రం, ఎం సుబ్బారావు, పి సురేంద్ర, ఈ సాంబయ్య, చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామా సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

### ద్వాక్రా మహిళలలకు శిక్షణ గ్రామా సంఘాలను బలోపేతం చేసి ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా సిసి రాజయ్య, దాసు ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 18)

మండలంలోని ద్వాక్రా గ్రూపు మహిళాసంఘాలను బలోపేతం చేసే దిశగా రెండు రోజులు ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు సిసి రాజయ్య తెలిపారు. మహిళలలు ఆర్థికాభివృద్ధి సాధించి వారికి కావాలసిన మౌళిక సౌకర్యాలు అందిస్తు వారికి తగిన శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆర్థికాభివృద్ధి సాధింఛడం, గ్రామ మహిళా సంఘాలను బలోపేతం చెయ్యడం, వారికి ఏర్పడే ఆవరొధలను అతిక్రమించడం వంటి వాటిపై శిక్షణ కార్యక్రమం జరగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మెహరున్నిసా, కార్యదర్శి అరుణ, కొశాధికారి సులొచన, ఇసి సభ్యులు శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



## నేడు వినుకొండ ఎంపీడీఓ కార్యాలయంలో చీఫ్ విప్ ‘ జీవీ ’ ప్రజా దర్బార్

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 18)

పట్టణ ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం వినుకొండ ఎంపీడీఓ కార్యాలయం వద్ద “ప్రజా దర్బార్” కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నాం 1 గంట వరకు జీవీ ఆంజనేయులు స్వయంగా ప్రజల నుండి అర్జీలు, ఫిర్యాదులను స్వీకరిస్తారు. ఈ కార్యక్రమంలో వినుకొండ పరిధిలోని ఆయా శాఖల అధికారులు కూడా పాల్గొననున్నారు. వినుకొండ మండలశీ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలు ఈ ప్రజా దర్బార్‌కు హాజరై తమ సమస్యలను దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించి తక్షణమే కృషి చేస్తానని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

## పురవీధులలో శ్రీనీలంపాటి లక్ష్మీ అమ్మవారి గ్రామోత్సవం





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 18)

మండల కేంద్రమైనతర్లుపాడులో వెలసిన శ్రీ మద్గణపతి, సుబ్రమణ్యం, నందీశ్వర, శ్రీ నీలంపాటి లక్ష్మీ అమ్మవారి షష్టమ దశ వార్షికోత్సవ సందర్భంగా గ్రామ పురవీధులలో అమ్మవారి ఊరేగింపు ఉత్సవం జన సందోహం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులందరూ అమ్మవారికి కార్యకర్తలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ ఉత్సవాన్ని వీక్షించేందుకు మండలంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని వారి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు అమ్మవారి ముందు దైవభక్తి పరమైన డీజే పాటలతో భజన చేసుకుంటూ, అమ్మవారిని అంగరంగ వైభవంగా అలంకరించి మిరిమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో చూపర్లకు కన్ను కొట్టే విధంగా ఆకర్షణీయంగా అమ్మవారి నిజస్వరూపాన్ని భక్తులు కనులారా తిలకించి భక్తితో అమ్మవారి దీవెనలు పొందారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఆట అత్యంత అద్భుతంగా నిర్వహించడంతో గ్రామమంతా బంధు మిత్రులతో రెండు మూడు రోజుల పాటు కలకలాడుతూ గ్రామ ప్రజలంతా సంతోషాలతో ఉంటారు. ఈ అమ్మవారి తిరణాలను తిలకించేందుకు స్త్రీ, పురుష భేదం లేకుండా సుదూర ప్రాంతాల నుండి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారు. ఈ సందర్భంగా 19న ఒంగోలు జాతిఎడ్ల బండలాగుడు పోటీలు కూడా నిర్వహించడం జరుగుతుందని కమిటీ వారు తెలిపారు.

## శ్రీ వివేకానంద విద్యార్థుల మరో ప్రభంజనం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 18)



గురువారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్సడ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలలో శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల పొదిలి విద్యార్థి షేక్ అహ్మద్ భాషా ఎంపీసీ ఇంగ్లీష్ మీడియం గ్రూపులో 992/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకును పొందారు. ఇప్పటికే బైపీసీలో రాష్ట్ర స్థాయిలో ప్రధమ ర్యాంకు సాధించిన శ్రీ వివేకానంద విద్యార్థులు ఎంపీసీ గ్రూపులో కూడా మరోసారి తన ప్రతిభను నిరూపించుకుంటూ రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి షేక్ అబీద్ అహ్మద్ భాషను కళాశాల యాజమాన్యం కెవి రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

# మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేయకపోతే కలెక్టరేట్ ముట్టడికైనా సిద్ధమే

### ఎమ్మార్పిఎస్ నగర అధ్యక్షులు గుంటూరు ప్రభుదాస్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18) ముంగమూరు రోడ్డు ప్రమాదంలో మరణించిన కవిల సజన, బుజ్జిబాయి కుటుంబాలకు న్యాయం చేయకపోతే కలెక్టరేట్ ముట్టడికైనా



వెనకాడమని ఎమ్మార్పిఎస్ నగర అధ్యక్షులు గుంటూరు ప్రభుదాస్ హెచ్చరించారు. ప్రమాదం జరిగి మూడు రోజులవుతున్నా ఇప్పటి వరకు అధికారులు ఎవరూ బాధితులను పరామర్శించక పోవడం దారుణం అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు చనిపోతే లెక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంపిన వారు అగ్రకుల వారు కనుక కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు, దళితులు, గిరిజన, నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి కుమార్తె మాట్లాడుతూ రాజకీయాలు చేయకుండా మాకు న్యాయం చెయ్యాలని అన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఇన్చార్జి తిరువీధి బాబు, కనుమూరి సుబ్బారావు, రాయపాటి సుబ్బారావు, ప్రసాద్ ఎన్ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాల ఆందోళనకు ఫలితంగా పుస్తకాల గదులను సీజ్ చేసిన విద్యాశాఖ






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18) అధికారులు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ధరలకు పుస్తకాల విక్రయం, ఫీజు నియంత్రణ చట్ట ఉల్లంఘనలకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ఒంగోలులోని రామ్ నగర్ వద్ద ఉన్న గుంటూరు ఆక్స్ఫర్డ్ పాఠశాల ఎదుట గంటసేపు ఆందోళన నిర్వహించి నినాదాలు చేశారు. విద్యను వ్యాపారంగా మార్చవద్దని, అధిక ఫీజులు మరియు పుస్తకాల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.విద్యార్థి సంఘాల ఆందోళనకు స్పందించిన విద్యాశాఖ అధికారులు ఆక్స్ఫర్డ్, సూర్య పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం జరుగుతున్నట్లు గుర్తించి ఆయా పాఠశాలల పుస్తకాల గదులను సీజ్ చేశారు. ఫీజు వివరాలు నోటీస్ బోర్డులో పెట్టించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరస్వామి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కొమ్ము విజయ్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్, పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్. రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి వినోద్ పాల్గొన్నారు.

# ఆధార్ సెంటర్ ద్వారా మార్పులు, చేర్పులకు అవకాశం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18) ఆధార్ సెంటర్ ద్వారా మార్పులు చేర్పులకు అవకాశం ఉందని సంతపేట ఇండియన్ బ్యాంక్ ఆధార్ సెంటర్ ఇన్ఛార్జి రామకృష్ణ తెలిపారు. స్కూల్ విద్యా సంవత్సరం ప్రారంభమైన. దృశ్య విద్యార్థులకు ఆధార్ కార్డులో ఏమైనా మార్పులు చెరుపులు ఉంటే ఆధార్ సెంటర్లో మార్పులకు అవకాశం ఉంటుంది అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు జరుగుతాయని అన్నారు. ఆధార్ కార్డులో ఏమైనా మార్పులు తెలుసుకున్నవారు అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో ఆధార్ సెంటర్‌కు రావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బద్వేల్‌లో వైభవంగా ప్రారంభమైన కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం













(షణ్ముఖ వెలుగు, బద్వేలు, జూన్ 18) బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని జాంబవంత నగర్ లో శ్రీ కోదండరామస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో భాగంగా ఉదయం నుంచే ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం వేళల్లో: గంగా నయనం, గణపతి పూజ, స్వస్తి వాచనం ,మాతృక పూజ, రక్షాబంధనం, ఆచార్యాది రుత్విగ్రహణం, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన, సర్వతోభద్ర మండల, ఏకలింగతోభద్ర మండల కలశ స్థాపన, అఖండ దీప ప్రతిష్ట, వాస్తు మండలారాధన,ఆదిత్యాది నవగ్రహారాధన, దేవి సప్తశతి పారాయణం,యంత్రములకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే, సాయంత్రం సమయంలో మృత్యుంగ్రహణం, అంకురార్పణం, ప్రధాన దేవత ఆవాహనం, అగ్ని ప్రతిష్ట, దీక్షా హోమం, మూలమంత్ర అనుష్టానం, జలాధివాసం, యంత్రములకు సహస్రనామార్చన మరియు మంగళహారతి వంటి విశేష పూజా కార్యక్రమాలను వైభవంగా పూర్తి చేశారు. ఈ మహోత్సవంలో భాగంగా భక్తులు, కంకణదారులు అమ్మవారి ఆలయం నుండి ప్రత్యేక బ్యాండ్ మేళా తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పుట్టమన్ను సేకరించి, ఊరేగింపుగా కోదండరామస్వామి దేవాలయం వద్దకు తీసుకువచ్చారు. కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో కంకణ ధారణ చేసి స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎక్కడా ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వళ్ళంకొండు వెంకటరమణ, కె.వి. సుబ్బారావు, రామకోటిరాజు, పెద్ది సుధాకర్, పబ్బతి చంద్రశేఖర్, సివి నాగేశ్వరరావు, సునీల్ కుమార్ తదితరులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రత్యేక పూజా దర్శనాలు కల్పించడంతో పాటు, మూడు పూటలా అల్పాహారం, విందు భోజన సౌకర్యాలను అద్భుతంగా ఏర్పాటు చేశారు, స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి విచ్చేసిన భక్తులు అందరికీ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేయడం జరిగింది, శ్రీ కోదండరామస్వామి విగ్ర ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం బ్రహ్మశ్రీ సత్యనారాయణ శర్మ, లోకేష్ శర్మ,బ్రహ్మ శర్మ, వెంకయ్య స్వామి పలువురు స్వాముల ఆధ్వర్యంలో కనుల పండగగా గురువారం ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో తోడేటి సుబ్బయ్య యాదవ్ సతీమణి తిరుపతమ్మ, రాచపూడి వెంకటరత్నం విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు పెరుగు వెంకటయ్య బిజెపి పట్టణ అధ్యక్షులు దర్మి శెట్టి వెంకటసుబ్బయ్య, కన్నమర్లపూటి రాజన్న, తులసి వెంకటసుబ్బయ్య వల్లంపండు అనిత్, కాలువ నాగేంద్రబాబు, శివకుమార్, దెయ్యాల వాసు, గంటా శ్రీనివాసులు, తెళ్ళ సునీల్, దియ్యాల కోదండ రామమూర్తి, దియ్యాల రామకృష్ణ, తెళ్ళ విష్ణువర్ధన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ముళ్ల పొదల్లో పసి శిశువు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18) పట్టణంలోని గాంధీరోడ్ లోని ఓపిఎస్ స్కూల్ ఎదురుగా శివారు ప్రాంతంలో మృతి చెందిన ఏడు రోజుల మగ శిశువును ముల్ల పొదల్లో పారేయడం జరిగింది. స్థానికులు ఆ శిశువును గమనించి స్థానికులు వెంటనే హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ కు సమాచారం ఇవ్వగా వెంటనే విషయాన్ని జిల్లా బాలల సంరక్షణ అధికారి పి దినేష్ కుమార్ దృష్టికి తీసుకువెళ్ళారు. వెంటనే స్పందించిన దినేష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని జిల్లా మహిళాశిశు సంక్షేమశాఖ అధికారి పి నాగమణి సూచన ప్రకారం జిల్లా బాలాల సంక్షేమ కమిటీ, తాలూకా పోలీసులకి, ఎమ్మెస్కే సిబ్బందికి, అంగన్వాడీ కార్యకర్తకి సమాచారం అందించి శిశువును ఎవరు పారవేశారు. అక్రమ సంతానమా, అనారోగ్యంతో మరణించాడా అనే విషయాన్ని విచారించడం జరుగుతుంది. శిశువుని ఒంగోలు రిమ్స్ హాస్పటల్‌కు తరలించి పోస్టుమార్టం తనంతరం తెలుస్తాయని జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్ కుమార్ తెలియజేశారు. స్థానిక అంగన్వాడీ కార్యకర్త అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా ఎస్ఐ పి చౌడయ్య కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18)
ఒంగోలు నగరంలో గురువారం సాయంత్రం నల్లటి మేఘాలతో ఒంగోలు కమ్ముకుపోయింది. ఉరుములు, మెరుపులతో, చల్లటి వాతావరణం నెలకొంది. ఆ సుందర దృశ్యాలు షణ్ముఖ వెలుగు స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఉబ్బా అశోక్ తన కెమెరాలో బధించారు ఇలా....!!

# టీడీపీ కార్యకర్త కుటుంబానికి ప్రమాద బీమా అందజేత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 18) కొత్తపట్నం గ్రామానికి చెందిన యాకసిరి వెంకటేశ్వర్లు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు వారు వృత్తి కళ్ళుగీత కార్మికుడు, తాటిచెట్టు మీద నుండి పడి మరణించడం జరిగింది. వారికి తెలుగుదేశం పార్టీ ప్రమాదబీమా పథకం కింద 5 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగింది. గురువారం వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నివాసం నందు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ చెక్కును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు సింగిరి శ్రీను, పురిని లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జిఎస్ఏ వార్షిక క్యాలెండర్ పై శిక్షణ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 18) చిన్నగంజాం మండలంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీఓ ఇంఛార్జ్ సి.హెచ్ పూర్ణచంద్రరావు, డిప్యూటీ ఎంపీడీఓ పి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటర్లు, డిఏలకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక క్యాలెండర్ 2026-27 రూపకల్పన పై ఓ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ పి శ్రీనివాసరావు వార్షిక క్యాలెండర్ భాగంగా సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, స్థానిక వనరుల సమీకరణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, పీసా అంశంలపై దిశానిర్దేశం చేశారు. పంచాయతీ పాలనను మరింత మెరుగుపరిచేందుకు, వార్షిక ప్రణాళికలను రూపొందించేందుకు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ,అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఇంఛార్జ్ సిహెచ్ పూర్ణచంద్రరావు, డిప్యూటీ ఎంపీడీఓ పి శ్రీనివాసరావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.